JAYABHERIDAILY.COM

జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రభాత జయభేరి

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

మేడ్చల్ - మల్కాజిగిరి । శనివారం 04-04-2026

Medchal - Malkajgiri । Saturday 04-04-2026

Follow: jayabherinews

సంపుటి : 02 । సంచిక : 306

పేజీలు : 8 । వెల : 5

Vol. 02 । Issue 306 । Pages : 8 । ₹: 5






# 2047 నాటికి తెలంగాణను టెక్స్‌టైల్ రాజధాని

- తెలంగాణలో తయారైన వస్త్రాలను ప్రపంచంలోని ప్రతి దేశంలో ప్రజలు ధరించేలా చేయాలన్నదే తన ఆశయమని
- కలిసికట్టుగా ప్రపంచాన్ని మార్చగల టెక్స్‌టైల్ వ్యవస్థను నిర్మిద్దాం
- పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్రంలో గ్రీన్ టెక్స్‌టైల్ హబ్‌లను అభివృద్ధి
- తెలంగాణ రైజింగ్ ప్రయాణంలో భాగస్వాములు కావాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

జయభేరి, హైదరాబాద్ :

వస్త్ర పరిశ్రమ రంగంలో 2047 నాటికి తెలంగాణను దక్షిణాసియాలోనే గొప్ప టెక్స్‌టైల్ రాజధానిగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. టెక్స్‌టైల్ రంగ అభివృద్ధి కోసం ప్రభుత్వం నిర్దేశించుకున్న విజన్‌కు అనుగుణంగా ప్రపంచాన్ని మార్చగల వాతావరణాన్ని సృష్టించడంలో మాతో భాగస్వామ్యం కావాలని పారిశ్రామిక వేత్తలకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీ తో కలిసి 13వ ఏషియా టెక్స్‌టైల్ సదస్సు 2026 ను నిర్వహించింది.

...మిగతాది 2 లో

# మళ్లీ 3వ వారంలో పార్లమెంట్ సెషన్స్



- 2029 సార్వత్రిక ఎన్నికల నాటికే 33 శాతం మహిళా కోటాను అమలు చేయాలన్నది ప్రభుత్వ ప్రధాన వ్యూహం

జయభేరి, న్యూఢిల్లీ, ఏప్రిల్ 3 :

కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ల అమలును వేగవంతం చేసేందుకు ఏప్రిల్ 16 నుంచి 18 వరకు మూడు రోజుల పాటు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను నిర్వహించాలని నిర్ణయించింది. 2023లో ఆమోదం పొందిన ఈ చట్టం..కొత్త జనగణన, నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే అమల్లోకి వస్తుందని గతంలో పేర్కొన్నారు. అయితే, తాజా సవరణల ద్వారా ఈ నిబంధనలను సడలించి, 2029 సార్వత్రిక ఎన్నికల నాటికే 33 శాతం మహిళా కోటాను అమలు చేయాలన్నది ప్రభుత్వ ప్రధాన వ్యూహం. ఈ ప్రత్యేక సెషన్‌లో ప్రవేశపెట్టబోయే ప్రతిపాదనల్లో అత్యంత కీలకమైనది లోక్‌సభ స్థానాల పెంపు. ప్రస్తుతం ఉన్న 543 స్థానాలను 816కు పెంచాలని ప్రభుత్వం యోచిస్తోంది. దీనివల్ల పెరిగిన స్థానాల్లో సుమారు 273 సీట్లను మొత్తం స్థానాల్లో మూడో వంతు మహిళలకు కేటాయించే అవకాశం ఉంటుంది. ఇలా చేయడం వల్ల ప్రస్తుతం ఉన్న పురుష ఎంపీల ప్రాతినిధ్యానికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా, అదనపు స్థానాల ద్వారా మహిళా రిజర్వేషన్లను అమలు చేయవచ్చని కేంద్రం భావిస్తోంది. ఇదే తరహా మార్పులను రాష్ట్ర అసెంబ్లీల్లో కూడా ప్రవేశపెట్టనున్నారు. అమలు ప్రక్రియలో ఉన్న ప్రధాన అడ్డంకిని తొలగించేందుకు ప్రభుత్వం ఒక వినూత్న మార్గాన్ని ఎంచుకుంది. కొత్త జనగణన కోసం వేచి చూడకుండా, 2011 జనాభా లెక్కల ఆధారంగానే నియోజకవర్గాల పునర్విభజన చేపట్టేందుకు వీలుగా డీలిమిటేషన్ చట్టాన్ని సవరించనున్నారు. దీనివల్ల జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాల సీట్ల సంఖ్య తగ్గకుండా, అన్ని రాష్ట్రాల్లోనూ దాదాపు 50 శాతం మేర సీట్లు పెరిగేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇందుకోసం ఒక రాజ్యాంగ సవరణ బిల్లుతో పాటు సాధారణ బిల్లును కూడా సభలో ప్రవేశపెట్టనున్నారు. ప్రతిపక్షాల నుంచి వస్తున్న విమర్శలు, సందేహాలను నివృత్తి చేసేందుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇప్పటికే పలువురు విపక్ష నేతలతో సంప్రదింపులు జరుపుతున్నారు. కేవలం రాజకీయ

...మిగతాది 2 లో



# రేవంత్ ఎక్కడికి వెళ్తే అక్కడ కాంగ్రెస్ ఖతమే


- కొడంగల్ లో హరీష్ రావు పర్యటన

జయభేరి, రంగారెడ్డి :

కొడంగల్లో మాజీ మంత్రి హరీష్రావు శుక్రవారం పర్యటించారు. హరీష్క రావు మాట్లాడుతూ తండాలను గ్రామపంచాయతీలు చేసిన ఘనత కేసీఆర్దే. మార్కెట్ కమిటీల్లో రిజర్వేషన్లు తెచ్చాం. ఎస్సీ, ఎస్టీల కేటాయింపులు రూ.2731 కోట్లు. ఖర్చు చేసింది కేవలం రూ.50 కోట్లేనని అన్నారు. సేవాలాల్ కార్పొరేషన్కు రూ.100 కోట్లు కేటాయించారు. రుపాయి కూడా విడుదల చేయలేదు. లగచర్ల రైతులను జైల్లో పెట్టిన ఘనత రేవంత్దే. కేరళ వెళ్లి 6 గ్యారంటీలు అమలు చేశామని చెప్తున్నారు. తెలంగాణలో 6 గ్యారంటీలు అమలౌతున్నట్టు నిరూపిస్తావా. 100శాతం రుణమాఫీ

...మిగతాది 2 లో

# అత్యుత్తమ రాజధానిగా అమరావతి ఇదే నా శపథం




- అమరావతి రైతుల త్యాగం వృధా పోదని భరోసా

జయభేరి, విజయవాడ, ఏప్రిల్ 3 :

ఏపీ రాజధాని అమరావతికి పార్లమెంట్ సాక్షిగా చట్టబద్ధత లభించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. పుష్కర కాలం కిందట తాము పునాది వేసిన అమరావతి కల ఇప్పుడు చట్టరూపం దాల్చడం శుభపరిణామమని కొనియాడారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలిపిన ఆయన, పార్లమెంట్‌లో అన్ని పార్టీలు ఈ బిల్లును సమర్థించినా, ఒక్క వైసీపీ మాత్రమే వ్యతిరేకించడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. దేశంలో అన్ని పార్టీలది ఒక దారైతే, వైసీపీది మరో దారి అంటూ ఆ పార్టీ వైఖరిని ఎండగట్టారు.ాను తెలంగాణ అభివృద్ధికి ఎప్పుడూ వ్యతిరేకం కాదని, నిజానికి సైబరాబాద్, హైటెక్ సిటీల రూపకల్పనతో తెలంగాణ తన బ్రెయిన్ చైల్డ్ అని చంద్రబాబు గుర్తుచేశారు. విభజన సమయంలో రెండు

...మిగతాది 2 లో



# యుద్ధ సంక్షోభం వేళ..

- ఆయిల్, గ్యాస్ సరఫరాపై భారత్‌కు భరోసా ఇచ్చిన రష్యా

జయభేరి, న్యూఢిల్లీ:

పశ్చిమాసియాలో యుద్ధం, హర్మూజ్ జల సంధిని ఇరాన్ నియంత్రించడంతో ప్రపంచ చమురు, గ్యాస్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ ప్రభావంతో అంతర్జాతీయంగా చమురు సంక్షోభం ఏర్పడి, అనేక దేశాలు ఇబ్బందులు పడుతున్నాయి. యుద్ధ ప్రభావం భారత్‌పై కూడా పడింది. దీంతో భారత్‌కు ఆయిల్, గ్యాస్‌పై రష్యా అభయం ఇచ్చింది. దీనిపై ప్రస్తుతం భారత్ పర్యటనలో ఉన్న రష్యా డిప్యూటీపీఎం.. కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, ఎస్ జైశంకర్‌తో జరిగిన భేటీలో ప్రస్తావించారు. ఇరాన్, అమెరికాఇజ్రాయెల్ యుద్ధం ప్రభావంతో ప్రపంచ మార్కెట్‌లో అనిశ్చితి నెలకుంది. అంతర్జాతీయ చమురు సరఫరాకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. ఈ సంక్షోభ సమయంలో భారత్‌కు

...మిగతాది 2 లో



# ఆటోలో ఒంటరిగా వచ్చిన నైజీరియన్ మహిళ..

- కొండాపూర్‌లో మిడ్‌నైట్ డ్రగ్ మసాలా రాకెట్..

జయభేరి, హైదరాబాద్ :

ఉక్కుపాదం మోపడం వల్ల పట్టుబడుతున్నారా? పట్టుబడినా జరిగేదేముందని మరింత బరితెగిస్తున్నారా? హైదరాబాద్ పరిధిలోని.. ఓ వైపు ఫాంహౌస్‌ల్లో, మరోవైపు పబ్‌ల్లో డ్రగ్ పార్టీలు యధేచ్ఛగా జరుగుతున్నాయి. లేటెస్ట్.. కొండాపూర్‌లో మిడ్‌నైట్ డ్రగ్ మసాలా రాకెట్ బయటపడిన కొన్ని గంటల్లోనే.. డ్రగ్స్ అమ్ముతూ మహిళ పట్టుబడటం కలకలం రేపింది.. సికింద్రాబాద్‌లోని పారడైజ్ సమీపంలోని సన్‌షైన్ హాస్పిటల్ దగ్గర డ్రగ్స్ విక్రయిస్తున్న నైజీరియన్ మహిళను అరెస్ట్ చేశారు పోలీసులు. ఏడున్నర గ్రాముల కొకైన్ స్వాధీనం చేసుకున్నారు, ముంబైలో గ్రాము 15వేల చొప్పున కొనుగోలు చేసి హైదరాబాద్‌లో 30వేల రూపాయిలకు విక్రయిస్తున్నట్టు గుర్తించారు. ఆటోలో వచ్చిన మహిళ.. డ్రగ్స్ సరఫరా చేయడానికి

...మిగతాది 2 లో



# రూ. 25 లక్షలతో 17 ఏళ్ల బాలుడు జంప్.!

జయభేరి, హైదరాబాద్ :

ఇంట్లో ఉన్న రూ.25లక్షల విలువైన నగదు, బంగారంతో 17 ఏళ్ల బాలుడు పారిపోయిన ఘటన హైరాబాద్‌లోని కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. కేపీహెచ్‌బీ కాలనీలో నాగిరెడ్డి అనే వ్యక్తి ఫ్యామిలీతో కలిసి నివసిస్తున్నాడు. ఇతనికి సిద్ధార్థ్ అనే 17 ఏళ్ల కుమారుడు కూడా ఉన్నారు. అయితే గత రెండ్రోజుల క్రితం సిద్ధార్థ్ ఇంట్లో ఉన్న సుమారు 9 తులాల బంగారం, రూ. 8 లక్షల నగదుతో పాటు తన తండ్రి బైక్ కూడా తీసుకొని పారిపోయాడు. అయితే పారిపోయే ముందు సిద్ధార్థ్ రెడ్డి ఓ లేఖ కూడా ఇంట్లోనే పెట్టి వెళ్లాడు. అందులో ఇలా రాసుకొచ్చాడు.. 'సారీ నాన్నా నేన్ వెళ్తున్నా.. బైక్‌ను బయట ఎక్కడో ఒకచోట వదిలేస్తానని లేఖలో పేర్కొన్నాడు. అద చూసిన తల్లిదండ్రులు మొదటి ఫోన్ చేయగా

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## మళ్లీ 3వ వారంలో పార్లమెంట్ సెషన్స్

ప్రయోజనాల కోసమే ప్రభుత్వం ఈ హడావుడి చేస్తోందని కాంగ్రెస్ వంటి పార్టీలు విమర్శిస్తున్నప్పటికీ, మహిళా సాధికారత విషయంలో వెనక్కి తగ్గకూడదని కేంద్రం గట్టి పట్టుదలతో ఉంది. ఈ ప్రత్యేక సమావేశాలు విజయవంతమైతే, భారత పార్లమెంట్ చరిత్రలో మహిళల ప్రాతినిధ్యం అత్యున్నత స్థాయికి చేరుకోవడం ఖాయం.

## యుద్ధ సంక్షోభం వేళ..

ఊరటనిచ్చేలా రష్యా అభయం ఇచ్చింది. భారత అవసరాలకు అనుగుణంగా ఇంధన సరఫరా పెంచుతామని హామీ ఇచ్చిన రష్యా.. ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని నిర్ణయించింది. క్రూడాయిల్, ఎల్ఎన్జీ సరఫరాను పెంచగలిగే సామర్థ్యం తమ చమురు కంపెనీలకు ఉందని రష్యా పేర్కొంది. ప్రస్తుతం భారత పర్యటనలో ఉన్న రష్యా తొలి డిప్యూటీ ప్రధాని డెనిస్ మంటురావ్ హామీ ఇచ్చారు. 2025 చివరి నాటికే రష్యా కంపెనీలు భారత్‌కు మినరల్ ఫర్టిలైజర్ సరఫరాను 40 శాతం మేర పెంచాయని ఆయన గుర్తుచేశారు. భారత్ రష్యాల ద్వైపాక్షిక భాగస్వామ్యం, సంబంధాలు ఇంధన రంగానికే పరిమితం కాదని చెప్పారు. అణు ఇంధన రంగాల్లోనూ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఇరు దేశాలూ కృషి చేస్తున్నాయని కూడా డెనిస్ వివరించారు. కూడంకుళం అణు విద్యుత్ ప్లాంట్‌లో అదనపు పవర్ యూనిట్ల ఏర్పాటు పనులు ప్రణాళిక ప్రకారం సాగుతున్నాయని ఆయన అన్నారు. యూరియా తయారీ కోసం భారత్ రష్యా సంయుక్తంగా చేపట్టిన ప్రాజెక్టు పనులు సక్రమంగా జరుగుతున్నాయని డెనిస్ తెలిపారు. భారత్ విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్‌తో సమావేశమైన రష్యా డిప్యూటీ ప్రధాని.. వాణిజ్యం, కనెక్టివిటీ, సాంకేతికత, అరుదైన మూలకాలు తదితర అంశాలపై చర్చించారు. గతేడాది జరిగిన భారత్‌రష్యా 13 వార్షిక శిఖరాగ్ర సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై కూడా సమీక్షించారు. 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 100 బిలియన్ డాలర్లకు చేర్చాలని నిర్ణయించారు. అణుశక్తి రంగంలోనూ సంబంధాలు బలోపేతం చేయాలని నిర్ణయించుకున్నారు. కాగా, గతేడాది నవంబరు తర్వాత రష్యా నుంచి భారత్ చమురు దిగుమతులు క్రమంగా తగ్గుముఖం పట్టాయి. ఉక్రెయిన్‌పై ఫిబ్రవరి 2022లో యుద్ధం మొదలైన తర్వాత.. రష్యా చమురుపై అమెరికా ఆంక్షలు విధించింది. దీంతో అప్పటి నుంచి రాయితీపై రష్యా చమురును భారత్ కొనుగోలు చేస్తోంది. జనవరి 2026లో 1.98 బిలియన్ డాలర్ల విలువైన క్రూడాయిల్‌ను దిగుమతి చేసుకుంది. గతంతో పోల్చితే దాదాపు 14 శాతం తగ్గింది. కానీ, ఫిబ్రవరి చివరిలో పశ్చిమాసియాలో యుద్ధం మొదలైనప్పటి నుంచి తిరిగి రష్యా నుంచి పెద్ద మొత్తంలో చమురు కొనుగోలు చేస్తోంది. రష్యా చమురు కొనుగోలుకు అమెరికా తాత్కాలికంగా అనుమతించడంతో దిగుమతి పెంచింది. అలాగే, మాస్కో నుంచి ఎల్ఎన్జీ కొనుగోలుకు భారత్ మినహాయింపులు కోరింది. దీనిపై ఇంకా అమెరికా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది.

## ఇదే నా శపథం

రాష్ట్రాలకు న్యాయం జరగాలని కోరుకున్నానని, కానీ రాజధాని కూడా లేకుండా ఏపీని విడదీయడం అన్యాయమని పేర్కొన్నారు. ఆ క్లిష్ట పరిస్థితుల్లో తన అనుభవంతో పోలవరం ముంపు మండలాలను ఏపీలో విలీనం చేయించానని, అవి కలిపితేనే తాను ముఖ్యమంత్రిగా ప్రమాణం చేస్తానని పట్టుబట్టి సాధించుకున్నానని నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. జగన్ ప్రతిపాదించిన మావిగన్ వంటి వింత పేర్లపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ పేరు చెప్పడానికి కూడా నాకు ఇష్టం లేదు అంటూ కౌంటర్ ఇచ్చారు. 2014లోనే 9 నగరాల కలయికతో ప్రపంచ స్థాయి రాజధానిగా అమరావతిని ప్లాన్ చేశామని, కానీ గత పాలకులు కుట్రలతో, నేరాలతో దాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారని ఆరోపించారు. రైతులను రెచ్చగొట్టినా వారు వెనక్కి తగ్గకుండా భూములు ఇచ్చారని, అమరావతి రైతుల త్యాగం వృథా పోదని భరోసా ఇచ్చారు. ఒకప్పుడు హైదరాబాద్ కంటే అమరావతిలోనే భూముల ధరలు ఎక్కువగా ఉండేవని చంద్రబాబు గుర్తుచేశారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ చుట్టూ భూములు ఇచ్చిన వారు ఎలాగైతే లాభపడ్డారో, భవిష్యత్తులో అమరావతి రైతులు కూడా అదే స్థాయిలో ఆర్థికంగా ఎదుగుతారని ధీమా వ్యక్తం చేశారు. ఏపీలో అపారమైన వ్యవసాయ భూములు ఉన్నాయని, సరైన ప్రణాళికతో అభివృద్ధి చేస్తే హైదరాబాద్‌ను మించిన సంపదను సృష్టించవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. గత పాలకుల తీరును ఉద్దేశించి మాట్లాడుతూ.. గతంలో వారిని సైకోలు అనేవారు, ఇప్పుడు అవన్నీ మాట్లాడదలుచుకోలేదు అంటూ పరోక్షంగా జగన్మోహన్ రెడ్డిపై విమర్శలు సంధించారు. వైసీపీ నేతలు గతంలో మంత్రులుగా ఎలా పనిచేశారో అర్థం కావడం లేదని, వారి కుట్రలు ఇక సాగవని హెచ్చరించారు. భగవంతుడు తనకు రెండు గొప్ప అవకాశాలు ఇచ్చాడని, ఒకప్పుడు హైదరాబాద్‌ను ప్రపంచ పటంలో నిలిపినట్లే, ఇప్పుడు అమరావతిని అత్యుత్తమ రాజధానిగా నిర్మిస్తానని చంద్రబాబు శపథం చేశారు.

## రేవంత్ ఎక్కడికి వెళ్తే..

అయినట్టు కొడంగల్లో నిరూపిస్తావా. రేవంత్ ఎక్కడికి వెళ్తే అక్కడ కాంగ్రెస్ ఖతమేనని అన్నారు. ఈరోజు వరకు లంబాడీలకు కాంగ్రెస్ పార్టీ మంత్రి పదవి ఇవ్వలేదు. ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ చేశారు.. డిక్లరేషన్ ఘనం, ఆచరణ శూన్యం. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రెండున్నర సంవత్సరాలలో ఎస్టీలకు, ఎస్టీ కార్పొరేషన్కు రూ.2730 కోట్లు పెట్టి ఖర్చు మాత్రం రూ. 50 కోట్లు పెట్టారు. ఒక్క ఎస్సీకి, ఎస్టీకి కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ చేయలేదు. దీన్నిబట్టే ఎస్టీలను కాంగ్రెస్ ఎంత చిన్న చూపు చూస్తుందో అర్థం అవుతుందిని అన్నారు. బీఆర్ఎస్ ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్లు ఇచ్చింది, తండాలను గ్రామపంచాయితీ చేసింది, మార్కెట్ కమిటీ రిజర్వేషన్ ఇచ్చాము, వైన్ షాప్ రిజర్వేషన్ ఇచ్చాము, వందల, వేల కోట్ల రూపాయలు సహకారం అందించామని అన్నారు.

## నైజీరియన్ మహిళ..

ప్రయత్నిస్తుండగా.. సికింద్రాబాద్ డిస్ట్రిక్ టాస్కోఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. 5 పాకెట్లలో కొకైన్ దాచి అమ్ముతున్నట్టు పోలీసులు గుర్తించారు. నిందితురాలిని సికింద్రాబాద్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.


**కొండాపూర్‌లో మిడ్‌నైట్ డ్రగ్ మసాలా రాకెట్..**

ఇదిలాఉంటే.. గత రాత్రి.. కొండాపూర్‌లో మిడ్‌నైట్ డ్రగ్ మసాలా రాకెట్‌ను బ్రేక్ చేసింది ఈగల్ టీమ్.. క్వేక్ ఏరినా పబ్‌లో బ్లాక్ కాఫీ పేరిట నైజీరియాకు చెందిన DJ ప్లేయర్‌తో పబ్‌లో స్పెషల్ ఈవెంట్ నిర్వహించారు. ఐతే డ్రగ్‌పార్టీ జరుగుతోందన్న పక్కా సమాచారంతో ఈగల్ టైమ్స్ రెయిడ్ చేశాయి. మత్తులో ఊగుతున్న 64 మందికి డ్రగ్ టెస్ట్‌లు నిర్వహిస్తే 8 మందికి పాజిటివ్ అని తేలింది.. కానీ 24 గంటల్లోపే ఆ లెక్క మారింది. ఏడుగురినే డ్రగ్ కన్స్యూమర్లుగా చూపించారు పోలీసులు. రిత్విక్ అనే అతనికి యూరిన్ టెస్ట్‌లో డ్రగ్ పాజిటివ్ అని తేలింది. కానీ ఆ తరువాత ఎర్రగడ్డ వైద్యుల నిర్వహించిన బ్లడ్ టెస్ట్‌లో రిత్విక్‌కు నెగిటివ్ అని వచ్చింది. నిద్ర మాత్రలు కారణంగానే యూరిన్ టెస్ట్‌లో పాజిటివ్ వచ్చిందని డాక్టర్లు చెప్పారన్నారు పోలీసులు. ఇక డ్రగ్ టెస్ట్‌లో పాజిటివ్ వచ్చిన ఆ ఏడుగురిలో ఎవరికీ ప్రీవియస్ హిస్టరీ లేదన్నారు పోలీసులు. ఇక క్వేక్ ఏరినా పబ్‌లో పార్టీకి అటెండైన నటి హేమ.. తనకు డ్రగ్ టెస్ట్‌లో నెగిటివ్ వచ్చిందంటూ వీడియో రిలీజ్ చేశారు. ఈగల్ టీమ్స్ రంగంలోకి దిగాక డ్రగ్ కేసుల గ్రాఫ్ పెరుగుతోంది. డ్రగ్ మాఫియా బెండు తీస్తున్నారు తెలంగాణ పోలీసులు.. ఈ క్రమంలోనే.. మరిన్ని కేసులు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

## రూ. 25 లక్షలతో బాలుడు జంప్.!

స్విచ్ఛ్ ఆఫ్ రావడంతో తీవ్ర ఆందోళనకు గురై వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గురువారం నుంచి తమ కుమారుడు కనిపించడం లేదని.. అలాగే ఇంట్లో ఉన్న డబ్బు కూడా మిస్సైందని పేర్కొన్నారు. అయితే, సిద్ధార్థ్ ఇంట్లోంచి వెళ్లి పోవడం ఇది తొలిసారేం కాదని.. గతంలోనూ ఒకటి రెండు సార్లు ఇలానే పారిపోయి మళ్లీ ఇంటికి తిరిగి వచ్చాడని తల్లిదండ్రులు చెబుతున్నారు. కానీ ఇంత భారీ మొత్తంలో డబ్బు, బంగారం తీసుకొని పారిపోవడం ఇదే తొలిసారని పేరెంట్స్ చెబుతున్నారు. పేరెంట్స్ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసుతో పాటు చోరీ కేసు నమోదు చేసుకున్న పోలీసులు బాలుడి ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు.

# రాష్ట్రాల్లో చట్టంగా మారుతున్న యూసీసీ



దేశవ్యాప్తంగా పలు రాష్ట్ర అసెంబ్లీలు యూనిఫాం సివిల్ కోడ్ బిల్లుకు వరుసగా ఇప్పుడు అది చట్టంగా మారనుంది. ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ) అవసరంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడారు. ఒకే కుటుంబంలో ఇద్దరికి భిన్నమైన నిబంధనలు వర్తించకూడదు. అసలు ఒకే ఇంట్లో రెండు విధానాలు ఎలా సాధ్యం?'' అని ప్రధాని మోదీ ప్రశ్నించారు. ఒకవేళ ఒకే ఇంట్లోని కుటుంబంలో ఇద్దరు వ్యక్తులకు రెండు రకాల చట్టాలుంటే, ఆ ఇల్లు నడవదు'' అని అన్నారు. చట్టం కూడా సమానత్వం గురించే మాట్లాడుతుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని మోదీ అన్నారు. ఈ బిల్లు మహిళలకు ప్రయోజనకరమని ప్రజావేదికల పైనా, మీడియాతోనూ, శాసనసభలోనూ మంత్రులు పదేపదే చెబుతున్నారు. ఈ బిల్లు ఆమోదం పొందాక, గుజరాత్‌లో మహిళల స్థితిగతులు, లివ్‌ఇన్ రిలేషన్‌షిప్‌ల గురించి కూడా చర్చ మొదలైంది. ఈ బిల్లు వల్ల మహిళలకు పెద్దగా ప్రయోజనం ఉండదని, పైగా సామాజిక సమస్యలు పెరుగుతాయని కొందరు నిపుణుల అభిప్రాయం. మరోవైపు, అణగారిన వర్గాల మహిళలకు ఈ బిల్లు వల్ల మేలు జరుగుతుందని మరికొందరు అంటున్నారు. యూనిఫాం సివిల్ కోడ్ బిల్లులో మహిళల కోసం ఉన్న ముఖ్యమైన నిబంధనలు ఏమిటి, వారికి ఎలాంటి కొత్త హక్కులు కల్పించబోతున్నారు? నిపుణులు ఏమంటున్నారు? ప్రతి మహిళకు వారసత్వ ఆస్తిలో సమాన వాటా లభిస్తుంది.

మతం ఆధారంగా మహిళల కోసం ఎటువంటి ప్రత్యేక నిబంధనలు ఉండవు సామాజిక సంప్రదాయాల ప్రకారం ఇచ్చే విడాకులు కాకుండా, కోర్టు ద్వారా మంజూరయ్యే విడాకులు మాత్రమే చెల్లుబాటు అవుతాయి. వివాహం ప్రతి మతంలో వారి ఆచారాల ప్రకారం చేసుకోవచ్చు, కానీ వివాహం రిజిస్ట్రేషన్ చేయించుకోవడం తప్పనిసరి. లివ్‌ఇన్ రిలేషన్‌షిప్‌లో ఉన్న మహిళను భాగస్వామి వదిలేస్తే, ఆమెకు భరణం పొందే హక్కు ఉంటుంది, వారికి పుట్టిన బిడ్డకు వారసత్వ హక్కులు లభిస్తాయి. వారసత్వ ఆస్తికి సంబంధించి ఎటువంటి వీలునామా రాయకపోతే స్థిరాస్తులు, చరాస్తులలో మహిళకు సమాన హక్కు లభిస్తుంది. ఏ మతంవారైనా సరే ఒక భార్య ఉండగా రెండో వివాహం చేసుకోకూడదనే నియమం తీసుకొచ్చారు. భర్త విడిచిపెట్టిన మహిళలకు న్యాయం చేసే అంశం కూడా ఈ బిల్లులో ఉంది. కోర్టు ద్వారానే కచ్చితంగా విడాకులు తీసుకోవాలనే నిబంధన గురించి రిటైర్డ్ జడ్జి జ్యోత్స్నా యాజ్ఞిక్ మాట్లాడారు. ''యూనిఫాం సివిల్ కోడ్‌లో సామాజిక పద్ధతుల్లో ఇచ్చే విడాకులను అంగీకరించే బదులు, కోర్టు ద్వారానే విడాకులు తీసుకోవడం తప్పనిసరి చేశారు. అయితే ప్రస్తుత పరిస్థితిని గమనిస్తే, ఫ్యామిలీ కోర్టులలో ఇప్పటికే విడాకుల కేసులు భారీగా పెండింగ్‌లో ఉన్నాయి. అటువంటప్పుడు రాబోయే రోజుల్లో విడాకుల కేసుల భారం మరింత పెరుగుతుంది" అన్నారు యాజ్ఞిక్. ''ప్రస్తుతం చాలా కులాల్లో సామాజిక పద్ధతుల్లో జరిగే విడాకులు ఇకపై చెల్లకుండా పోతాయి. దీనివల్ల ఫ్యామిలీ కోర్టుల్లో కేసుల పరిష్కారానికి ఎక్కువ సమయం పడుతుంది. కొన్ని కేసుల్లో తక్కువ వయసున్న అమ్మాయిలు లేదా అబ్బాయిల విడాకుల పిటిషన్లు సరైనవే అయినప్పటికీ, ఇటువంటి పరిస్థితుల్లో కేసులు సుదీర్ఘకాలం కొనసాగుతాయి. దీనివల్ల విడాకుల తర్వాత తిరిగి వివాహం చేసుకునే అవకాశం చాలామందికి తగ్గిపోతుంది'' అని జ్యోత్స్నా యాజ్ఞిక్ చెప్పారు. ''చాలా సమాజాలలో 'లేఖణి', 'సాటాపాటా' వంటి ఆచారాలు ఇంకా కొనసాగుతున్నాయి. ఇటువంటి సంప్రదాయ పద్ధతుల ద్వారా జరిగే విడాకుల ప్రక్రియ దుర్వినియోగమవుతున్నట్లు 2021 చివరిలో గుజరాత్ హైకోర్టులో జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ నానావతి ధర్మాసనం గుర్తించింది. అయినప్పటికీ, నేటికీ ఈ పద్ధతులు కొనసాగుతున్నాయి. తక్కువ చదువుకున్నవారు, ఆత్మగౌరవం కోసం విడాకులు తీసుకునే మహిళలు ఈ పద్ధతుల ద్వారా విడాకులు పొందినా స్వల్ప కాలంలోనే మరో వివాహం చేసుకోగలుగుతున్నారు. ఇప్పుడు కోర్టులలో ఇటువంటి కేసుల భారం పెరిగి, న్యాయమూర్తుల సంఖ్య తక్కువగా ఉంటే, కొన్ని కులాలకు చెందిన మహిళలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది'' అని ఆమె అభిప్రాయపడ్డారు. ''మహిళలకు అత్యంత ప్రమాదకరమైన నిబంధన ఏదైనా ఉందంటే, అది లివ్‌ఇన్ రిలేషన్‌షిప్‌కు గుర్తింపునివ్వడమే. ఈ సంబంధాలను రిజిస్ట్రేషన్ చేసుకోవడం తప్పనిసరి చేశారు. గతంలో లివ్‌ఇన్ రిలేషన్‌షిప్‌లో ఉండేవారు సమాజానికి భయపడేవారు. కానీ ఇప్పుడు బహిరంగంగా, చట్టబద్ధంగా ఇటువంటి సంబంధాల్లో ఉండవచ్చు. కొత్త తరంలో లివ్‌ఇన్ రిలేషన్‌షిప్‌లకు ఈ విధంగా గుర్తింపు లభిస్తే, సమాజాన్ని ఏకంగా ఉంచే వివాహ వ్యవస్థ బలహీనపడిపోతుంది. ఇది రాబోయే రోజుల్లో ప్రమాదకరం'' అని న్యాయవాది పూజా ప్రజాపతి అభిప్రాయపడ్డారు ''లివ్‌ఇన్ రిలేషన్‌షిప్ ద్వారా జన్మించిన బిడ్డకు కూడా హక్కులు కల్పించే అంశం ఈ చట్టంలో ఉంది. ఈ సంబంధాల వల్ల కలిగే పిల్లల విషయంలో స్త్రీ, పురుషుల మధ్య కొత్త చట్టపరమైన వివాదాలు తలెత్తుతాయి. లివ్‌ఇన్‌లో ఉన్న మహిళపై ఆరోపణలు వస్తే, కొత్త గొడవలు మొదలయ్యే అవకాశం ఉంది. దీనివల్ల మహిళలకు ఎక్కువ నష్టం కలగవచ్చు. అంతేకాకుండా, 18 నుంచి 21 ఏళ్ల లోపు యువతీ యువకులు లివ్‌ఇన్ రిజిస్ట్రేషన్ చేయించుకుంటే వారి తల్లిదండ్రులకు సమాచారం అందించాలనే నిబంధన ఉంది. దీనివల్ల కొత్త సామాజిక సంఘర్షణలు మొదలవుతాయి. ఈ యూనిఫాం సివిల్ కోడ్ వల్ల దీర్ఘకాలంలో ప్రయోజనం కంటే వివాహ వ్యవస్థకే ముప్పు పొంచి ఉంది'' అని చెప్పారు. యూనిఫాం సివిల్ కోడ్ ద్వారా విడాకుల కేసుల్లో మహిళలకు తక్షణమే భరణం అందడం, వివాహం జరిగిన ఏడాది తర్వాతే విడాకుల కేసు దాఖలు చేయాలనే నిబంధనలు మంచి పరిణామాలే. అయితే, మహిళలకు దీనివల్ల ఏవో పెద్దఎత్తున ప్రయోజనాలు కలుగుతాయని మాత్రం అనిపించడం లేదు'' అని పూజా ప్రజాపతి అన్నారు.

## 2047 నాటికి తెలంగాణను టెక్స్‌టైల్ రాజధాని

ఈ సదస్సులో ముఖ్యమంత్రి అటెక్స్‌కాన్2026 నివేదికను విడుదల చేశారు. సదస్సులో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "అత్యుత్తమ వస్త్రాలను తయారు చేసిన గొప్ప చరిత్ర భారతదేశానికి ఉంది. శతాబ్దాలుగా కళలు, సంస్కృతి, సంప్రదాయాలు టెక్స్‌టైల్స్ రంగాన్ని పరిపూర్ణంగా తీర్చిదిద్దాయి. నిజాం కాలంలో ప్రపంచ నలుమూలల నుంచి వ్యాపారులు హైదరాబాద్ నగరానికి వచ్చి వస్త్రాలు, ముత్యాలు కొనుగోలు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఈ విషయాన్ని గర్వంగా చెప్పగలదు. టెక్స్‌టైల్స్ మా డీఎన్ఏలో ఉంది. వస్త్ర పరిశ్రమలో తెలంగాణ ముందంజలో ఉండటానికి చారిత్రక కారణాలున్నాయి. దేశంలో పత్తి ఉత్పత్తిలో అగ్రగామిగా ఉన్నాం. పత్తి నాణ్యతకు ప్రపంచవ్యాప్తంగా పేరుంది. టెక్స్‌టైల్ తెలంగాణకు కేవలం పరిశ్రమ మాత్రమే కాదు. ప్రజల జీవనాధారం. ప్రసిద్ధి చెందిన పోచంపల్లి ఇక్కత్, గద్వాల చీరలు, వరంగల్ దుర్రీస్, నారాయణపేట చేనేత వరకు అనేకం ఇక్కడున్నాయి. తెలంగాణలో నైపుణ్యం ఉంది. మంచి సంకల్పం కూడా ఉంది. డీప్‌టెక్, ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, డిఫెన్స్ మాన్యుఫాక్చరింగ్, ఎనర్జీ వంటి అనేక రంగాల్లో తెలంగాణ ముందంజలో ఉంది. వరంగల్‌లో కాకతీయ ప్రపంచ స్థాయి మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను ఏర్పాటు చేశాం. అందులో అనేక అప్పరెల్ పార్కులున్నాయి. మా విజన్ తెలంగాణ రైజింగ్2047. 2034 నాటికి ఒక ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలన్నది మా లక్ష్యం. వస్త్ర పరిశ్రమకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం భూమి, విద్యుత్, నీరు వంటి మౌలిక సదుపాయాలను కల్పిస్తూ ప్రోత్సహిస్తుంది. అవసరమైన అనుమతులను వేగంగా మంజూరు చేస్తుంది. ప్రపంచ పోటీకి అనుగుణంగా విధానాలు అనుసరిస్తున్నాం. అత్యుత్తమ మానవ వనరుల బలం ఉంది. తెలంగాణ పత్తి పొలాల నుండి లండన్, న్యూయార్క్, పారిస్, మిలాన్, టోక్యో, దుబాయ్ ఫ్యాషన్ షోల వరకు అనేక అంశాల్లో మేం కలిసి పనిచేస్తున్నాం. మీకు విజన్ ఉంటే, మేము మీకు సరైన భాగస్వాములం అవుతాం. అందరం కలిసి, ప్రపంచాన్ని మార్చగల పూర్తి టెక్స్‌టైల్ ఎకోసిస్టమ్‌ను నిర్మిద్దాం.

హైదరాబాద్ భారతదేశానికి కాకుండా, ప్రపంచానికి సినిమా నిర్మాణ కేంద్రంగా ఎదుగుతోంది. ఇటీవల నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోలను ఇక్కడ ప్రారంభించాను. టాలీవుడ్, బాలీవుడ్ ఇప్పటికే హైదరాబాద్‌ను తమ కేంద్రంగా ఉపయోగిస్తున్నాయి. ఇప్పుడు హాలీవుడ్ కూడా చేరింది. సినిమా రంగం తమ ఫ్యాషన్‌ను కూడా తెలంగాణ నుంచే అభివృద్ధి చెందేలా ప్రోత్సహిస్తాం. పర్యావరణ పరిరక్షణ మాకు అత్యున్నత ప్రాధాన్యం. గ్రీన్ టెక్స్‌టైల్ హబ్‌లను అభివృద్ధి చేస్తాం. యువతకు ముఖ్యంగా మహిళలకు శిక్షణనిస్తాం. సంప్రదాయ ఆలోచనలతో పాటు ఆధునిక పరికరాలతో కలిపి డిజైన్, కట్టింగ్, స్టిచింగ్‌లో ఉపయోగించగలం. ప్రపంచంలోని ప్రతి దేశం తెలంగాణలో తయారైన దుస్తులను ధరించేలా చేయాలన్నది మా సంకల్పం. తెలంగాణ ఒక రాష్ట్రం మాత్రమే కాదు. విజయవంతమైన భాగస్వాములం. అందరం కలిసి సరికొత్త భవిష్యత్తును నిర్మిద్దాం. తెలంగాణ రైజింగ్ ప్రయాణంలో భాగస్వాములు కావాలి.." అని పెట్టుబడుదారులకు పిలుపునిచ్చారు.



# టార్గెట్ హరీష్ రావు

■ **ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇప్పుడు తన రూటు మార్చి హరీష్ రావును టార్గెట్ చేయడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ**

**జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 3 :**

తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు మాజీ మంత్రి హరీష్ రావు చుట్టూ తిరుగుతున్నాయి. నిన్నటి వరకు కేటీఆర్, కవితలపైనే విమర్శనాస్త్రాలు సంధించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇప్పుడు తన రూటు మార్చి హరీష్‌రావును టార్గెట్ చేయడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా హరీష్ రావుపై భూకబ్జా ఆరోపణలు చేయడం, వ్యక్తిగత విమర్శలకు దిగడం వెనుక పెద్ద రాజకీయ వ్యూహమే ఉందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. రేవంత్ రెడ్డి నేరుగా పేరు ఎత్తకపోయినా, హరీష్ రావును ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా కలకలం రేపాయి. ముఖ్యంగా కన్న తండ్రిని పట్టించుకోని వారు.. ప్రజలను ఏం పట్టించుకుంటారు అనే అర్థం వచ్చేలా రేవంత్ చేసిన ఆరోపణలు హరీష్‌రావును తీవ్రంగా ఇబ్బంది పెట్టేవిగా ఉన్నాయి. రాజకీయాల్లో ట్రబుల్ షూటర్‌గా పేరున్న హరీష్‌రావుపై ఇలాంటి వ్యక్తిగత, అవినీతి ఆరోపణలు రావడం ఆయన ఇమేజ్‌కు పెద్ద సవాల్‌గా మారింది. ప్రభుత్వం ఇప్పటికే హరీష్ అనుచరులు, ఆయనకు సంబంధించిన భూ వ్యవహారాలపై విచారణకు ఆదేశించడం ఆయనను మరింత ఒత్తిడిలోకి నెట్టింది. ఈ పరిణామాల మధ్య కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు కొత్త ట్విస్ట్‌ను ఇచ్చాయి. రేవంత్ రెడ్డి కావాలనే హరీష్ రావును ఒంటరిని చేస్తున్నారని, కేటీఆర్ మరియు కవితలతో రేవంత్ కున్న రహస్య ఒప్పందంలో భాగంగానే ఈ వ్యూహం నడుస్తోందని సంజయ్ ఆరోపించారు. అంటే, బీఆర్ఎస్ పార్టీని హరీష్ రావు చేతుల్లోకి వెళ్లకుండా అడ్డుకోవడానికి, కల్వకుంట్ల కుటుంబంలోని అంతర్గత విభేదాలను రేవంత్ తనకు అనుకూలంగా మార్చుకుంటున్నారన్నది బీజేపీ వాదన. ఈ ఆరోపణల్లో నిజమెంత ఉన్నా, రేవంత్ రెడ్డి ఒక్కసారిగా హరీష్ పై పడటం వెనుక బీఆర్ఎస్ కేడర్‌ను గందరగోళానికి గురిచేసే ప్లాన్ స్పష్టంగా కనిపిస్తోంది. ప్రస్తుతానికి పరిస్థితులు హరీష్ రావుకు వ్యతిరేకంగా మారుతున్నట్లు కనిపిస్తున్నాయి. అటు ప్రభుత్వపరంగా విచారణలు, ఇటు రాజకీయంగా సొంత పార్టీలోనే ప్రాధాన్యత తగ్గిపోతోందన్న ప్రచారం ఆయనను ఆత్మరక్షణలో పడేశాయి. కేటీఆర్ అమెరికా పర్యటనలో ఉన్న సమయంలోనే హరీష్ రావుపై ఈ స్థాయిలో దాడులు జరగడం యాదృచ్ఛికం కాదని రాజకీయ పండితులు భావిస్తున్నారు. హరీష్‌రావుకు ఉన్న మాస్ ఇమేజ్‌ను దెబ్బతీయడం ద్వారా బీఆర్ఎస్‌ను బలహీనపరచవచ్చని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ఎన్నికల సమయంలో లేదా పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు సంక్షోభాలను చక్కదిద్దే హరీష్ రావు, ఇప్పుడు తన సొంత రాజకీయ ఉనికిని కాపాడుకోవాల్సిన పరిస్థితి ఎదురైంది. రేవంత్ రెడ్డి విసురుతున్న సవాళ్లను ఆయన ఎలా ఎదుర్కొంటారన్నది ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే హరీష్ రావు తనపై వస్తున్న ఆరోపణలను ఖండిస్తూ, ప్రభుత్వం వద్ద ఆధారాలు ఉంటే బయటపెట్టాలని సవాల్ విసిరారు. కానీ, అటు కాంగ్రెస్ ప్రభుత్వం, ఇటు బీజేపీ నేతల విమర్శల మధ్య ఆయన తన పట్టును ఎలా నిలుపుకుంటారో చూడాలి. రేవంత్ రెడ్డి వర్సెస్ హరీష్‌రావు పోరు రాబోయే రోజుల్లో మరింత ముదిరే అవకాశం ఉంది. ఒకవైపు ప్రజా సమస్యలపై పోరాడుతూనే, మరోవైపు తనపై వస్తున్న అవినీతి మరకలను తొలగించుకోవాల్సిన బాధ్యత హరీష్‌పై ఉంది. రేవంత్ రెడ్డి చేస్తున్న ఈ మైండ్ గేమ్' బీఆర్ఎస్‌లో చీలిక తెస్తుందా లేక హరీష్‌రావును మరింత బలమైన నేతగా మారుస్తుందా అనేది కాలమే నిర్ణయించాలి.

# ఎక్కడో ఒకచోట ప్రారంభం కావాలి

- తెలంగాణ ప్రభుత్వం విద్యపైన ప్రత్యేక శ్రద్ధ, ఆసక్తిని చూపుతోంది
- ఒక్కో పాఠశాలలో 2500 విద్యార్థులు చదువుకునేలా నిర్మాణాలు
- 2034 లో ఒలింపిక్స్ భారతదేశంలో నిర్వహించాలని ప్రధానమంత్రి ప్రయత్నం



**జయభేరి, హైదరాబాద్ :**

ఒక సునామీలా ముంచుకొస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) ముప్పును ఎదుర్కొనడానికి ప్రత్యామ్నాయ మార్గాలపై ఆలోచనలు చేయాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఏఐ వల్ల వైట్ కాలర్ ఉద్యోగాలు కోల్పోతే దేశ ఆర్థిక వ్యవస్థ అత్యంత ప్రమాదంవైపు నెట్టబడుతుందని, ప్రత్యామ్నాయంగా బ్లూ కాలర్ ఉద్యోగాలకు అనుగుణంగా వాతావరణాన్ని మార్చుకోవలసిన అవసరం ఉందని నొక్కి చెప్పారు.
విద్యావేత్త, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి ఇబ్రహీంపట్నంలో స్థాపించిన AVN Lakefield Global School ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, పరిస్థితులకు అనుగుణంగా విద్యా రంగంలో అనేక సంస్కరణలు తీసుకొస్తున్నామని వివరించారు. ఏఐ సునామీలో దేశం ఎదుర్కోబోయే సమస్య ఎంత తీవ్రమైందో ప్రతి ఒక్కరూ ఆలోచించాలని పిలుపునిచ్చారు. పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాల్సిన అవసరం ఉందని చెప్పారు. "ప్రతి గ్రామంలోనూ విద్య అందుబాటులో ఉన్నప్పటికీ, నాణ్యమైన విద్యను అందించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయి. ఎక్కడ విఫలమయ్యామో ప్రజా ప్రతినిధులు అందరూ ఆలోచన చేయాలి. పరిస్థితులకు అనుగుణంగా కొన్ని కఠినమైన నిర్ణయాలు తీసుకోవలసిన అవసరం ఉంది. ఎక్కడో ఒకచోట ప్రారంభం కావాలి. వ్యవస్థను ఎంపవర్ చేయాల్సిన అవసరముంది. తెలంగాణ ప్రభుత్వం విద్యపైన ప్రత్యేక శ్రద్ధ, ఆసక్తిని చూపుతోంది. అందులో భాగంగానే వంద నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను, ఒక్కో పాఠశాలలో 2500 విద్యార్థులు చదువుకునేలా నిర్మాణాలు ప్రారంభించాం. ఇప్పటికే 59 స్కూల్స్ పనులు ప్రారంభించాం. మూడో తరగతి చదువుతున్న విద్యార్థి ఒకటో తరగతి పుస్తకాన్ని చదవలేని పరిస్థితి. 6వ తరగతిలో ఉన్న విద్యార్థి 3వ తరగతి పుస్తకం చదవలేకపోతున్నాడు. విద్యలో నాణ్యత తగ్గుతోంది. ఈ పరిస్థితి దేశ భవిష్యత్తుకే అత్యంత ప్రమాదకరం. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థిపై ప్రభుత్వం 1 లక్షా 8 వేల రూపాయలు ఖర్చు చేస్తోంది. బడ్జెట్లో 8.3 శాతం నిధులు విద్యపైన ఖర్చు పెడుతున్నాం. ప్రైవేటు విద్యా సంస్థల తరహాలో ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ, ఎల్ కేజీ, యూకేజీ విధానం లేదు. రాష్ట్రంలో 26 వేల ప్రభుత్వ పాఠశాలల్లో 18 లక్షల మంది విద్యార్థులుంటే, 11 వేల ప్రైవేటు పాఠశాలల్లో 33 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వం విఫలం చెందడం వల్లే ప్రైవేటు వైపు వెళుతున్నారు. అందుకే వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రయోగాత్మకంగా వంద ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ నుంచి 12వ తరగతి విధానం తీసుకొస్తున్నాం. 1.34 కోట్ల జనాభా కలిగిన హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియా CURE లో పాఠశాలలను రేషనలైజేషన్ చేసి ప్రయోగాత్మకంగా మోడల్ స్కూళ్లను ప్రారంభిస్తున్నాం.
ప్రైవేటు పాఠశాలలు సక్సెస్ కావడానికి నర్సరీ, ఎల్‌కేజీ వంటి విధానంతో పాటు రవాణా సౌకర్యం కూడా ఒక కారణం. అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో కూడా విద్యార్థులకు రవాణా సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. వీటికి తోడు బ్రేక్ ఫాస్ట్, లంచ్, అది కూడా మంచి పోషకాహారాన్ని అందించాలని నిర్ణయించాం. విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి. క్రీడల్లో రాణించిన వారిని కూడా ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. 2034 లో ఒలింపిక్స్ భారతదేశంలో నిర్వహించాలని ప్రధానమంత్రి ప్రయత్నం చేస్తున్నారు. ఆ ఒలింపిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం.." అని ముఖ్యమంత్రి వివరించారు.



## ప్రజా ఉద్యమాల నిర్మాణానికి తోడ్పాటు నివ్వాలి

**జయభేరి, తుర్కపల్లి, ఏప్రిల్ 03 :**

ప్రజా పోరాటాలను బలోపేతం చేయడానికి భారత కమ్యూనిస్టు పార్టీకి అన్ని వర్గాల ప్రజలు ఆర్థిక సహకారం అందించి ప్రజా ఉద్యమాల నిర్మాణానికి తోడ్పాటు ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కళ్లెం కృష్ణ అన్నారు .శుక్రవారం తుర్కపల్లి మండల కేంద్రంలో ఇంటింటికి సిపిఐ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ దేశంలో ఆవిర్భవించి 100 సంవత్సరాలు దాటిన నేపథ్యంలో మతోన్మాద, కార్పోరేట్ కబంధహస్తాల నుండి దేశాన్ని విముక్తి చేసి సమ సమాజ స్థాపన కోసం నిరంతరం పోరాటాలు చేస్తున్న ఏకైక పార్టీ సిపిఐ అని అన్నారు. కార్మికులు రైతులు, మహిళలు ,విద్యార్థులు, యువజనలు తదితర సంఘాలను నిర్మించి వెట్టి చాకిరి నిర్మూలనకు, కార్మికులు, కర్షకులను దోపిడీ నుండి విముక్తి చేయడానికి సిపిఐ పోరాటం సాగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి సిల్వర్ దుర్గయ్య, మండల సహాయ కార్యదర్శి గుంటుపల్లి సత్తయ్య, మండల కార్యవర్గ సభ్యులు మన్నోజు సిద్ధి నరసింహ చారి, దుడుక లక్ష్మీనారాయణ పాల్గొన్నారు

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన సర్పంచ్



**జయభేరి, తుర్కపల్లి, ఏప్రిల్ 03 :**

తుర్కపల్లి మండలం వేల్పుపల్లి గ్రామానికి చెందిన బరిగే భాస్కర్ అనారోగ్యంతో మరణించడంతో ఆయన కుటుంబానికి గుజ్జవానికుంట తండా సర్పంచ్ గుగులోతు ధూప్ సింగ్ నాయక్ అంత్యక్రియల నిమిత్తం 5 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు

## ప్రభుత్వ విప్ గురించి మాట్లాడే స్థాయి బీఆర్ఎస్ నాయకులకు లేదు



**జయభేరి, తుర్కపల్లి, ఏప్రిల్ 03:**


ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య గురించి మాట్లాడే స్థాయి బీఆర్ఎస్ నాయకులకు లేదని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ధనావత్ శంకర్ నాయక్ అన్నారు. శుక్రవారం తుర్కపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అర్హత లేని బీఆర్ఎస్ నాయకులు నిన్న నిర్వహించిన మీడియా సమావేశంలో బీర్ల ఐలయ్య పై చేసిన ఆరోపణలు అవాస్తవమని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై దేశవ్యాప్తంగా విమర్శలు వస్తున్నాయని పార్లమెంటు సమావేశాల్లో కూడా ఆ ప్రాజెక్టుకు అవినీతి అంశాలు వెలుగులోకి వచ్చాయని అన్నారు. బీర్ల అయిలయ్య స్వంత ఖర్చులతో సుమారు 100 చెరువులను నింపుతూ రైతులకు, ప్రజలకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. ఆయన చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు అర్థం లేని విమర్శలు చేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే కృషితో నియోజకవర్గానికి 3700 ఇందిరమ్మ ఇండ్లు మంజూరై పేదల సొంతింటి కల నెరవేరింది అన్నారు. వాసాలమర్రి గ్రామంలో సుమారు 200 ఇండ్లు నిర్మాణం జరుగుతోందని నియోజకవర్గంలో రోడ్డు నిర్మాణం విద్యాభివృద్ధి కోసం, ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు చాడ భాస్కర్ రెడ్డి, జిల్లా సర్పంచుల ఫోరం ప్రచార కార్యదర్శి భూక్య రాజారాం నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పట్టు నాయక్, డిసిసి అధ్యక్షుడు ధనావత్ భాస్కర్ నాయక్, అయినాల మహేందర్ రెడ్డి, మోహన్ బాబు, గడ్డమీది నిఖిల్ గౌడ్, బాలు యాదవ్, విజయ్ నాయక్ పాల్గొన్నారు.

## చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని చిన్నచింతకుంట మండలానికి చెందిన లబ్ధిదారులకు శుక్రవారం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) చెక్కులను అందజేశారు. అలాగే లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను కూడా అధికారులు, నాయకులతో కలసి ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటిన దేవరకద్ర విద్యార్థిని

- కల్పన చావ్లా టెస్టులో రాష్ట్రస్థాయి 2వ ర్యాంక్ సాధించిన నిత్య
- ఈనెల 14న నిత్యకు హైదరాబాద్ లో బహుమతి ప్రధానం

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర కు చెందిన విద్యార్థిని కల్పన చావ్లా టెస్టు స్థాయిలో 2వ ర్యాంకు సాధించి తన ప్రతిభను చాటింది. దేవరకద్ర కు చెందిన స్థానిక జర్నలిస్టు సంఘం గౌరవ అధ్యక్షుడు రమేష్‌చారి, మాధురి దంపతులకు నిత్య ఒక్కగానొక్క కూతురు. నిత్య మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని సంస్కార పాఠశాలలో 8వ తరగతి చదువుతుంది. అయితే హైదరాబాద్ లో నిర్వహించిన కల్పన చావ్లా టెస్టులో నిత్య రాష్ట్ర స్థాయిలో 2వ ర్యాంకు సాధించింది. అభ్యాస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. ఈనెల 14న హైదరాబాద్ లో నిర్వహించే ఓ కార్యక్రమంలో నిత్య బహుమతి అందుకోనున్నట్లు సంస్కార పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. కల్పన చావ్లా టెస్టులో ప్రతిభ కనబరిచిన నిత్యను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పట్టణ ప్రజలు, జర్నలిస్టులు అభినందించారు.

## ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలకు హాజరైన ఎమ్మెల్యే జిఎంఆర్




**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని అడ్డాకుల మండలం రాచాలలో వాకిటి లక్ష్మయ్య, వాకిటి నరసింహులు లకు చెందిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమాలకు శుక్రవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇళ్ల యజమానులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పొన్నకల్ లో దోనూర్ రాఘవేందర్ రెడ్డి గృహప్రవేశ కార్యక్రమానికి కూడా ఎమ్మెల్యే జిఎంఆర్ హాజరై వారికి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే చిన్నచింతకుంట మండలం దమగ్నాపూర్ లో చాకలి మహేష్ కుమారుడు వివాహానికి దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## అమీన్పూర్ పరిధిలో సర్వే నం. 993 దుర్గంధంతో నిండిపోయే ప్రమాదం..!

- 100 ఎంఎల్డి సామర్థ్యమున్న ఎస్‌టీపీ (సెవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్) నిర్మాణంపై స్థానిక నివాసులు తీవ్ర ఆందోళన
- పుణ్యక్షేత్రమైన భ్రమరాంబిక మల్లికార్జున దేవస్థానం ప్రాంతం ఇవన్నీ
- మోదీ విల్లాస్ / గోల్డెన్ ప్లామ్స్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులకు ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి



**జయభేరి, అమీన్పూర్ :**

అమీన్పూర్ పరిధిలోని సర్వే నంబర్ 993లో ప్రతిపాదితంగా ఏర్పాటు చేయబడుతున్న 100 ఎంఎల్డి సామర్థ్యమున్న ఎస్‌టీపీ (సెవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్) నిర్మాణంపై స్థానిక నివాసులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్లాంట్‌ను మోదీ విల్లాస్ / గోల్డెన్ ప్లామ్స్ కాలనీలకు ఆనుకొని నిర్మించడానికి చర్యలు చేపడుతున్నట్లు సమాచారం. ఈ ఒక్క కాలనీనే కాకుండా లింగమయ్య కాలనీ సాయి భగవాన్ కాలనీ పుణ్యక్షేత్రమైన భ్రమరాంబిక మల్లికార్జున దేవస్థానం ప్రాంతం ఇవన్నీ కూడా దుర్గంధంతో నిండిపోయే ప్రమాదం ఉంది. ఈ రెండు కాలనీలలో కలిపి దాదాపు 150కి పైగా కుటుంబాలు నివసిస్తున్నాయి. ఎస్‌టీపీ ప్లాంట్ ఏర్పాటు వల్ల దుర్వాసనలు, ఆరోగ్య సమస్యలు, పర్యావరణ కాలుష్యం వంటి అనేక ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
అదేవిధంగా, ప్లాంట్ నిర్మాణాని కి ఎంపిక చేసిన ప్రదేశంలో వందల సంఖ్యలో ఉన్న చెట్లను నరుకుతున్నారని, అక్కడ నివసిస్తున్న నెమళ్లు మరియు ఇతర జీవరాశుల జీవనానికి తీవ్ర ముప్పు వాటిల్లుతోందని కాలనీ వాసులు పేర్కొంటున్నారు. జేసీబీలతో జరుగుతున్న తవ్వకాల కారణంగా ఆ జీవరాశులు కాలనీలలోకి ప్రవేశించడం ప్రారంభించాయని వారు తెలిపారు. ఇంకా, ఈ ప్రాంతానికి ఆనుకొని ఇప్పటికే ఒక డంప్ యార్డ్ ఉన్నది. అందులో చెత్తను సమయానికి తొలగించకపోవడం వల్ల దోమల విపరీత పెరుగుదలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితులో మరొక పెద్ద ఎస్‌టీపీ ప్లాంట్ ఏర్పాటుతో పరిస్థితి మరింత దిగజారుతుందని వారు భయపడుతున్నారు. ఈ సమస్యపై చర్చించి, తగిన చర్యలు తీసుకోవాలని మోదీ విల్లాస్ / గోల్డెన్ ప్లామ్స్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు సంబంధిత అధికారులను మరియు ప్రజాప్రతినిధులను కలిసి తమ ఆందోళనలను తెలియజేయడానికి సిద్ధమవుతున్నారు. తక్షణం తమ సమస్యలకు పరిష్కారం చూపాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

## జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీ సభ్యుల ఎన్నిక



- నూతన కమిటి సభ్యులను సన్మానించిన నక్క ప్రభాకర్ గౌడ్

**జయభేరి, శామీర్ పేట్, ఏప్రిల్ 3:**

కాంగ్రెస్ పార్టీ అందరి పార్టీ అని, ప్రజా సంక్షేమమే పార్టీ ప్రధాన లక్ష్యమని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేశ్ యాదవ్ అన్నారు. మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీలో నూతనంగా కమిటీలను నియమించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై నూతన కమిటీ సభ్యులను సన్మానించారు. ఇక జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షునిగా వేముల మహేష్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శులుగా ఇటిక్యాల కృష్ణారెడ్డి, ఏనుగు జితేందర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా ఉదండపురం సత్యనారాయణను నియమించారు. ఈ కార్యక్రమానికి తోటకూర వజ్రేశ్ యాదవ్ తో పాటు మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, జిల్లా ఆర్టీఏ సభ్యులు భీమిడి జైపాల్ రెడ్డి లు హాజరై నూతన కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికలు ఎప్పుడూ వచ్చిన కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలోసీనియర్ కాంగ్రెస్ నాయకులు వేముల శ్రీనివాస్ రెడ్డి ,సాయిపెట్ శ్రీనివాస్, తుంగతుర్తి రవి , బొమ్మక్ శ్రీనివాస్ ,సంతోష్ గౌడ్ ,రామస్వామి ముదిరాజ్ , అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేశ్ ,మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ ఎస్టి సెల్ అధ్యక్షులు నానావత్ సురేష్ నాయక్ ,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తుంకి బిక్షపతి ,శివ శంకర్ , నాయకులు బత్తుల రాజు గౌడ్ , బద్రి హేమంత్ కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కల్తీ మామిడి పండ్లతో జాగ్రత్త, ఫోన్ చేయండి

- సీపీ సజ్జనార్

జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 3





కల్తీ మామిడి పండ్లతో జాగ్రత్తగా ఉండాలని.. సీపీ సజ్జనార్ సూచించారు. కొంతమంది వ్యాపారులు.. మామిడి పండ్లను తొందరగా పక్వానికి వచ్చేందుకు ప్రమాదకరమైన రసాయనాలను ఉపయోగిస్తున్నారని తెలిపారు. పచ్చగా ఆకర్షణీయంగా కనిపిస్తున్న ప్రతీ మామిడి పండును మంచిది అని కొనుగోలు చేస్తే.. మన అనారోగ్యాన్ని మనమే తెచ్చుకున్నట్లు అవుతుందని సీపీ సజ్జనార్ తీవ్ర హెచ్చరికలు చేశారు. ప్రస్తుతం వేసవి కాలం రావడంతో మామిడి పండ్ల సీజన్ వచ్చేసింది. పండ్లలో రారాజు అయిన మామిడి పండు పేరు వింటేనే నోట్లో నీళ్లు ఊరుతున్నాయి. మార్కెట్లో బంగారు వర్ణంతో.. చూస్తేనే తినాలనే విధంగా.. నిగనిగలాడే మామిడి పండ్లు.. బండ్లు, దుకాణాల్లో సందడి చేస్తున్నాయి. రకరకాల మామిడి పండ్లు అన్నీ మార్కెట్‌కు రావడంతో మ్యాంగో లవర్స్ ఆనందంలో మునిగిపోతున్నారు. అయితే ఇప్పుడు మామిడి పండ్ల ప్రియుల గుండె గుభేల్ మనే వార్త వచ్చింది. కొందరు కాసుల కక్కుర్తి ఉన్న వ్యాపారులు.. మామిడి పండ్లను రసాయనాలతో మగ్గించి.. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఈ విషయంపై హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ సోషల్ మీడియా వేదికగా.. ప్రజలను అప్రమత్తం చేశారు. కల్తీ మామిడి పండ్లకు సంబంధించిన సమాచారాన్ని ఫోన్ చేసి చెప్పాలని వెల్లడించారు. వేసవి రాకతో పండ్లలో రారాజైన మామిడి పండ్లు మార్కెట్‌లో సందడి చేస్తోందని.. నోరూరించే ఈ ఫలాల మాటున ప్రాణాంతకమైన విషపు కోరలు దాగి ఉన్నాయన్న నిజాన్ని ప్రజలు విస్మరించకూడదని సజ్జనార్ అలర్ట్ చేశారు.

కాసుల కక్కుర్తితో కొందరు స్వార్థపరులైన వ్యాపారులు ప్రజల ప్రాణాలను పణంగా పెడుతున్నారని.. సహజ సిద్ధంగా పక్వానికి రావాల్సిన మామిడి పండ్లను కాల్షియం కార్బైడ్, ఇతర రసాయాలను ఉపయోగించి కృత్రిమంగా మగ్గించి విక్రయిస్తున్నారని తెలిపారు. రోడ్డు పక్కన బండ్ల మీద నిగనిగలాడుతూ.. పసిడి వర్ణంతో కంటికి అత్యంత ఆకర్షణీయంగా కనిపిస్తున్న ప్రతి పండునూ నాణ్యమైనదిగా భావించి కొనుగోలు చేయడం అంటే.. అనారోగ్యాన్ని స్వయంగా కొని తెచ్చుకోవడమేనని సజ్జనార్ ట్వీట్ చేశారు.సాధారణంగా సహజంగా పండిన పండు అంతటా ఒకే రంగులో ఉండదు.. కానీ రసాయనాలతో మగ్గించిన పండ్లు మాత్రం పైన పసుపు పచ్చగా ఉండి..లోపల మాత్రం పచ్చిగా ఉండి విషతుల్యంగా మారుతాయని సీపీ సజ్జనార్ తెలిపారు. ఇలాంటి రసాయనాలతో మగ్గించిన పండ్లను తినడం వల్ల గొంతులో మంట, కడుపులో వికారం, వాంతులు, విరేచనాలు వంటి సమస్యలతో పాటు.. దీర్ఘకాలంలో నాడీ వ్యవస్థ దెబ్బతినడం, శ్వాసకోశ ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారని సజ్జనార్ పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే ఇలాంటి కల్తీ వ్యాపారుల పట్ల హైదరాబాద్ పోలీస్ విభాగం ఇప్పటికే ఉక్కుపాదం మోపుతోందని సీపీ సజ్జనార్ వెల్లడించారు. కల్తీ మామిడి పండ్లపైనా హెచ్‌ఫాస్ట్ నిఘా ఉంచుతోందని.. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పండ్ల రూపాన్ని చూసి ప్రజలు మోసపోకుండా.. వాటి సహజత్వాన్ని గుర్తించి కొనుగోలు చేయాలని కోరుతున్నట్లు చెప్పారు.సహజంగా పండిన పండ్ల కంటే అసహజమైన రంగు, రసాయన వాసన, వింత రుచి కలిగిన మామిడి పండ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని సీపీ సజ్జనార్ సూచించారు. మామిడి పండ్లపై అసాధారణంగా మచ్చలు ఉన్నా లేదా బేకింగ్ సోడా నీటిలో కడిగినప్పుడు రంగు మారినా అవి ఆరోగ్యానికి హానికరమని గ్రహించాలని తెలిపారు. కల్తీ మామిడి పండ్ల సమాచారం తెలిస్తే డయల్ 100కి గానీ.. హెచ్‌ఫాస్ట్ ఫోన్ నంబర్ 8712661212కు సమాచారం ఇవ్వాలని సజ్జనార్ ప్రజలకు వెల్లడించారు.



## నూతనంగా పరవాడ మీడియా క్లబ్ సంఘం ఏర్పాటు

జయభేరి, పరవాడ:

పరవాడ మండలంలోని జర్నలిస్టులు నూతనంగా పరవాడ మీడియా క్లబ్ పేరుతో సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఈ సంఘానికి అధ్యక్షుడిగా రెడ్డి గోపి (టీవీ5) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ.. జర్నలిస్టుల అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సంఘం ఏర్పాటు పట్ల ఇతర సభ్యులు హర్షం వ్యక్తం చేశారు, కొత్త కమిటీకి పలువురు శుభాకాంక్షలు తెలిపారు. కార్యవర్గసభ్యులుగా అధ్యక్షులు రెడ్డి గోపి (టీవీ 5),డి .కృష్ణ (ఎన్ టీవీ), కె . చంద్ర శేఖర్ (టీవీ 9), కె.మోహన్ (99టీవీ), ఆర్ వివిఎస్ నాయుడు (సాక్షి టీవీ), ఎం నూకరాజు (ఈ టీవీ ),బి. ఈశ్వరరావు, ఎల్.మోహన్, ఓ రాము, పి. ప్రసాద్ ఉన్నారు.

## ప్రజలు ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలి



జయభేరి, పరవాడ:

పరవాడ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆర్. మల్లికార్జున రావు ఆధ్వర్యంలో శుక్రవారం పరవాడలోని ఎంఆర్ఓ ఆఫీస్ జంక్షన్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో హెల్మెట్ లేకుండా బైక్‌లు నడిపినవారికి, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపినవారికి జరిమానాలు విధించారు. ఇటీవలి కాలంలో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో ముఖ్యంగా హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపే వారి మీద పోలీసులు నిరంతరం మరియు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తూ, కఠిన చర్యలు తీసుకుంటూ జరిమానాలు విధిస్తున్నారు.అలాగే బైక్‌పై ప్రయాణించే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ప్రమాద సమయంలో అది ప్రాణాలను కాపాడుతుందని వివరించి అవగాహన కూడా కల్పించారు. ప్రజల భద్రత దృష్ట్యా ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

## పంచాయతీ పాలకవర్గానికి ప్రత్యేక ధన్యవాదములు తెలిపిన గొర్లి గోపి



జయభేరి, పరవాడ:

పరవాడ మండలం గొర్లెవానిపాలెం గ్రామ పంచాయతీ పాలకవర్గం ఐదు సంవత్సరాల పదవీకాలం విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ గొర్లి అమ్మలు మాట్లాడుతూ ఈ ఐదు ఏళ్ళు తమకు సహకారం అందించిన సభ్యులను అభినందనలు తెలిపారు. అదే విధంగా ఈ ఐదు సంవత్సరాల్లో గ్రామాభివృద్ధికి పంచాయతీ పాలకవర్గం అందించిన సహకారం మరువలేనిదని అన్నారు.వైస్సార్సీపీ యువ నాయకుడు గొర్లి గోపి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో అందరి ఆశీస్సులతో ఇంకా మంచి సేవలు అందించడానికి కృషి చేస్తామని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సేవలో ఉంటాం అని అన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గం సభ్యులు,మాజీ ఎంపీటీసీలు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## చత్రపతి శివాజీకి ఘన నివాళి



జయభేరి, కొండమల్లేపల్లి :

చత్రపతి శివాజీ మహారాజ్ వర్ధంతి సందర్భంగా కొండమల్లేపల్లి మండల కేంద్రం చౌరస్తాలో చత్రపతి శివాజీ విగ్రహ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మరాఠా సామ్రాజ్య వ్యవస్థాపకులు చత్రపతి శివాజీ 1680 ఏప్రిల్ 3న రాయగడ్ కోటలో తుది శ్వాస విడిచారని అన్నారు. ఇదే రోజు దేశవ్యాప్తంగా ఆయన సేవలను స్మరించుకుంటూ నివాళులు అర్పిస్తారని అన్నారు.హిందూ సామ్రాజ్యాన్ని స్థాపించి మొఘల్ బీజాపూర్ సుల్తానులను బెదిరించిన గొప్ప వీరుడిగా ఆయనను మనం స్మరించుకోవడం గొప్ప విషయం అన్నారు. శివాజీ మహారాజ్ ధైర్య సాహసాలు,యుద్ధ వ్యూహాలు, పరిపాలన దక్షిత నేటికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆయన మరణానంతరం ఆయన కుమారుడు చత్రపతి శంభాజీ ఆయన ధైర్యసహసాలను పునికి పుచ్చుకొని రాజ్యాలను కాపాడారని అన్నారు. అటువంటి మహానుభావుని ప్రతి హిందువు స్మరించుకోవాలన్నారు. కొండమల్లేపల్లిలో చత్రపతి శివాజీ విగ్రహాన్ని అందరి సహకారంతో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు అధికారులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏరుకొండ రాము, కూన భానుచందర్, అలంపల్లి విజయ్, బొడ్డుపల్లి మల్లికార్జున్, బొడ్డుపల్లి చంద్రమౌళి, మలికంటి ఆంజనేయులు, గుండెబోయిన రవి, డబ్బు శ్రీకాంత్,నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డితో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య సమావేశం

- పాడి పారిశ్రామికాభివృద్ధి, మదర్ డెయిరీపై చర్చ

జయభేరి, యాదగిరిగుట్ట :



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సమావేశమయ్యారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ ఛైర్మన్ డాక్టర్ మీనేష్ షా, మదర్ డైయిరీ ఢిల్లీ ఛైర్మన్ జయతీర్థా చారితో కలసి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పాడి పారిశ్రాకాభివృద్ధితో పాటు తెలంగాణ రాష్ట్రంలో మదర్ డైయిరీ,పాడి పరిశ్రమ అభివృద్ధి కోసం పాలు ఉత్పత్తి పెంపు, రైతులకు ప్రోత్సాహకాలు, మదర్ డెయిరీ మౌలిక వసతుల విస్తరణ,సహకార సంఘాల బలోపేతం వంటి అంశాలపై సమావేశంలో చర్చించారు. మదర్ డెయిరీ రంగంలో పెట్టుబడులు పెంచడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కల్పించడంపై చర్చించినట్లు తెలిపారు.

ఈ సమావేశంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి,తెలంగాణ రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ ఛైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి,ప్రిన్సిపల్ సెక్రటరీ ఇలంబర్తి,మదర్ డెయిరీ ఛైర్మన్ మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డిని శాలువాలతో ఘనంగా సత్కరించారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రతి ఇంటింటికీ సీపీఐ కార్యక్రమం

జయభేరి, యాదగిరిగుట్ట :




గ్రామాలలో నెలకొన్న ప్రజా సమస్యలు పరిష్కరించడానికే ప్రతి ఇంటింటికీ సీపీఐ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి,రాష్ట్ర కమిటీ సభ్యులు గోదా శ్రీరాములు తెలిపారు. శుక్రవారం యాదగిరిగుట్ట మండలంలోని మర్రిగూడెం గ్రామంలో ప్రతి ఇంటింటికీ సీపీఐ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. సీపీఐ వందేళ్లు పూర్తి చేసుకుని దేశాన్ని మతోన్మాద కార్పొరేట్ కబంధ హస్తాల నుండి విముక్తి చేసి సమసమాజ స్థాపనకై రాజీలేని పోరాటాలు చేస్తున్న ఏకైక పార్టీ అని అన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల, ప్రజావ్యతిరేక విధానాలు అమలు చేస్తూ రైతుల హక్కులను కాలరాసే విధంగా 3 రైతు చట్టాలను తీసుకొచ్చిందని, కార్మిక హక్కులను హరించే 4 కార్మిక చట్టాలను చేసిందని విమర్శించారు. ప్రతి ఇంటింటికీ సీపీఐ ద్వారా గ్రామాలలో ప్రజల నుండి సమస్యలను తెలుసుకుని ఆ సమస్యల పరిష్కారానికి పోరాటాలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కొల్లూరి రాజయ్య, బండి జంగమ్మ, పేరబోయిన మహేందర్, మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్,మున్సిపల్ మాజీ కోఆప్షన్ మెంబర్ పేరబోయిన పెంటయ్య, మర్రిగూడెం గ్రామ సర్పంచ్ బోదాసు స్వప్నజగన్, సిపిఐ నేతలు నాతకాని కిష్టమ్మ, యాదయ్య, లక్ష్మి,గడ్డం యాదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ జాగృతి పార్టీలో చేరిన గుర్రం వెంకటేష్

జయభేరి, మేడ్చల్ :




రానున్న రోజుల్లో రాష్ట్రంలో తెలంగాణ జాగృతి పార్టీ ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా మారడం ఖాయమని యువ నాయకుడు గుర్రం వెంకటేష్ తెలిపారు. శుక్రవారం రాష్ట్ర బిసి సంఘం అధ్యక్షుడు మరన్న ఆధ్వర్యంలో జాగృతి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జాగృతి పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం గుర్రం వెంకటేష్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై కల్వకుంట్ల కవిత పోరాటాలను చూసి పార్టీలో చేరడం జరిగిందన్నారు. ఉద్యమ కాలం నుండి తెలంగాణ సంస్కృతిని, అస్తిత్వాన్ని ప్రపంచవ్యాప్తం చేయడంలో కవితమ్మ పోషించిన పాత్ర అసామాన్యమైనదని, ఇప్పుడు అదే స్ఫూర్తితో ఒక బలమైన రాజకీయ ప్రత్యామ్నాయంగా ఈ పార్టీ ఎదుగుతుందని ధీమా వ్యక్తం చేశారు.

కేవలం నినాదాలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పార్టీ పనిచేస్తుందని, యువత, మహిళలు, మరియు బడుగు బలహీన వర్గాలకు ఈ ప్రయాణం ఒక పెద్ద భరోసా అని ఆయన అన్నారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని,

ప్రస్తుత రాజకీయ గందరగోళానికి తెరదించి, ప్రగతిశీల మార్గంలో ప్రయోజనాలే పరమావధిగా తెలంగాణ అడుగులు వేయబోతున్నట్లు వెల్లడించారు.



## 19న పేరూర్ లో పాఠశాల డైమండ్ జూబ్లీ సెలబ్రేషన్స్

- కార్యక్రమానికి హాజరుకావాలని ఎమ్మెల్యే జిఎంఆర్ కు పూర్వ విద్యార్థుల ఆహ్వానం
- 75 వసంతాలు పూర్తి చేసుకున్న పేరూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని కౌకుంట్ల మండలం పేరూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 19న డైమండ్ జూబ్లీ సెలబ్రేషన్స్ ను నిర్వహించనున్నారు. దీనికి గాను ఈ కార్యక్రమానికి రావాలని శుక్రవారం ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ను ఆహ్వానించారు. పేరూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రారంభించి 75 వసంతాలు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు నిర్వహించనున్నారు.

## దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ ను సన్మానించిన జిల్లా కోర్టు బార్ అసోసియేషన్

జయభేరి, దేవరకద్ర :

అద్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుక వచ్చిన సందర్భంగా న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావడంలో కీలకపాత్ర పోషించిన మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ను జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం చిన్నచింతకుంట మండలం, దమగిలాపూర్ లో ఘనంగా సన్మానించారు. అలాగే ఆత్మకూరు బార్ అసోసియేషన్ సభ్యులు కూడా ఎమ్మెల్యే జీఎంఆర్ ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ నగర్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, సభ్యులతో పాటు ఆత్మకూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, సభ్యులతో పాటు తదితర న్యాయవాదులు ఎమ్మెల్యే జిఎంఆర్ సమాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకులు సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని మదనాపురం మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన మండల కాంగ్రెస్ ముఖ్య నాయకుల కార్యకర్తల సమావేశంలో దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మదనాపురం మార్కెట్ యార్డ్ ఛైర్మన్ మల్లేపాగు ప్రశాంత్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, మండల కార్యదర్శి ఇంచార్జ్ తులసిరాజ్ లతో పాటు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సాయి ప్రియా కాలనీ అభివృద్ధికి భారీ ముందడుగు

- రూ. 9 కోట్ల డ్రైనేజ్ పనులకు ఆమోదం
- ప్రజల సమస్యల పరిష్కారం – సమిష్టి బాధ్యత, అభివృద్ధే మన లక్ష్యం!



**జయభేరి, మేడిపల్లి :**

మేడ్చల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లి డివిజన్, సాయి ప్రియా కాలనీలో డ్రైనేజ్ సమస్యల పరిష్కారానికి రూ. 9 కోట్ల నిధులు మంజూరు కావడం ఎంతో సంతోషకరం. ఈ గొప్ప నిర్ణయాన్ని హర్షిస్తూ కాలనీ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కాలనీ సభ్యులు, కార్పొరేటర్ ఈశ్వర్ రెడ్డి కలిసి అభినందనలు తెలిపారు.
ఈ అభివృద్ధి కార్యక్రమంలో మాజీ మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూరి వజ్రేష్ యాదవ్, పీర్జాదిగూడ మాజీ మేయర్ అమర్ సింగ్, బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూరి అజయ్, పీర్జాదిగూడ మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ ఎనుగు జలేందర్ రెడ్డి, పీర్జాదిగూడ మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి, మాజీ గ్రంథాలయ చైర్మన్ దర్గా దయాకర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ శ్రీ ఈశ్వర్ రెడ్డి గారు ,మాజీ కోఆప్షన్ సభ్యుడు జగేశ్వర్ రెడ్డి. అమర్ సింగ్ మాట్లాడుతూ.. "నేను మేయర్‌గా పనిచేసిన కాలంలోనే సాయి ప్రియా కాలనీ డ్రైనేజ్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలనే లక్ష్యంతో నిరంతరం కృషి చేశాను. ఆ సమయంలో ప్రారంభించిన ప్రయత్నాలు, ప్రజల తరఫున చేసిన పోరాటం నేడు ఫలితాన్నిచ్చి ఈ నిధుల మంజూరుకు దారితీసినందుకు ఎంతో సంతోషంగా ఉంది. ఇది కేవలం నిధుల మంజూరు మాత్రమే కాదు – ప్రజల సమస్యలపై ప్రభుత్వం చూపుతున్న కట్టుబాటు. భవిష్యత్తులో కూడా ప్రతి కాలనీ అభివృద్ధి కోసం ఇదే విధంగా కృషి కొనసాగిస్తాం. ప్రజల సంక్షేమమే మా లక్ష్యం ."ఈ కార్యక్రమంలో పీర్జాదిగూడ మాజీ కార్పొరేటర్లు, మాజీ కోఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, అలాగే కాలనీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ అభివృద్ధి కార్యక్రమానికి సహకరించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము.



## ఇందిరమ్మ గృహాన్ని ప్రారంభించిన సర్పంచ్ కొర్ర రాంసింగ్ నాయక్

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మండలం మైనంపల్లి గ్రామం కొర్రతండా కు చెందిన కొర్ర రేఖారమేష్ నాయక్ కు ఎమ్మెల్యే బాలునాయక్ ఆధ్వర్యంలో మంజూరైన ఇందిరమ్మ ఇంటిని గ్రామ సర్పంచ్ కొర్ర రాంసింగ్ నాయక్ పాలకవర్గ సభ్యులతో గ్రామ పెద్దలతో కలిసి ప్రారంభించారు.ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ లాలూ నాయక్,మాజీ సర్పంచ్ పాండు నాయక్,వార్డు సభ్యులు లక్ష్మీ ప్రశాంత్, సునీత బద్దు, సంతోష వెంకట్, కిషన్ నాయక్,వడిత్య స్నేహ వినోద్,పులిజాల నాగరాజు, గ్రామ కాంగ్రెస్ పెద్దలు కొర్ర గణేష్ కొర్ర శ్రీను,జబ్బార్ లాల్,నరేష్, శ్రీకాంత్, రమేష్,నవీన్,చందు,లాల్య, బిచ్చు,మహేష్,మంగులాల్ తదితరులు పాల్గొన్నారు.

## యాదగిరీశుడి సేవలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి దంపతులు



**జయభేరి, యాదగిరిగుట్ట, ఏప్రిల్ 03 :**

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారిని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామి,అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం చేయగా, యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవానీ శంకర్ స్వామి వారి లడ్డు ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ లోకల్ అడ్వైజరీ మాజీ సభ్యుడు వడ్లోజు వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ నేతలు తంగళ్ళపల్లి ప్రమోద్ కుమార్, పోతంశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



## అక్రమ సిలిండర్లు పట్టివేత

**జయభేరి, డిండి :**

ఫిర్యాదు అందిన మేరకు, DSCO ఆదేశాల ప్రకారం, గుండ్లపల్లి మండలంలోని టి. గౌరారం గ్రామ పరిధిలోని దేవత్‌పల్లి తండా వద్ద తనిఖీలు నిర్వహించబడినవి. ఈ సందర్భంగా 2 H.P గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకుని, 6A కేసు నమోదు చేయబడినది.

# నాణ్యమైన వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- ఏఎంసీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతిరెడ్డి



**జయభేరి, తొర్రూరు, ఏప్రిల్ 3 :**

తొర్రూరు వంటి ప్రాంతాలలో అందుబాటులో ఉన్న కార్పొరేట్ తో పాటు,నాణ్యమైన వైద్య సేవలను సద్వినియోగం తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్ కుమార్, ఏఎంసీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతిరెడ్డిలు అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని చింతలపల్లి రోడ్డులోని నూతనంగా శ్రీ సూర్య ఆర్థోపెడిక్ అండ్ జనరల్ హాస్పిటల్ ను వైద్యులు డాక్టర్ కె. సంతోష్,డాక్టర్ ఎ.అశ్విత తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివిజన్ కేంద్రంలో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, తొర్రూరు డివిజన్ లోని వివిధ మండలాల చుట్టూ పరిసరాల ప్రాంత ప్రజలు సుదీర్ఘ ప్రాంతాలకు వెళ్లకుండా అందుబాటులో నాణ్యమైన వైద్య సేవలను సద్వినియం చేసుకోవాలని కోరారు. పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించే దిశగా ఈ హాస్పిటల్ విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కొడకండ్ల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఇరెంట్టి సాయిక్రిష్ణ,1,10వ వార్డు కౌన్సిలర్లు బుసాని జయమ్మ ఉప్పలయ్య,ముద్దసాని సురేష్,కాంగ్రెస్ నాయకులు అనుమాండ్ల నరేందర్ రెడ్డి,తాల్లపల్లి బిక్షం గౌడ్, తూర్పాటి రాంబాబు,సట్ల చంటి తదితరులు పాల్గొన్నారు.

## దంతాలపల్లి ఆర్టీసీ బస్టాండ్ లో వసతులను కల్పించాలి

- మరుగు దొడ్లు లేక ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- సామాజిక విద్యావేత్త సేను రాజేష్




**జయభేరి, దంతాలపల్లి, ఏప్రిల్ 3 :**

మండల కేంద్రంలో ఉన్నటువంటి ఆర్టీసీ బస్టాండ్ ని అభివృద్ధి చేయాలని మండల కేంద్రానికి చెందిన సామాజిక విద్యావేత్త సేను రాజేష్ కోరారు.శుక్రవారం ఆయన మాట్లాడుతూ దంతాలపల్లి మండల కేంద్రంలో ఉన్న ఆర్టీసీ బస్టాండ్ కొంత మంది దాతలు సాయంతో విలువైనటువంటి భూమిని దానం చేయగా బస్టాండ్ నిర్మితమైంది, అట్టి బస్టాండ్ లో మరుగుదొడ్లు,వగైరా మౌలిక వసతులు లేకపోవడంతో నిరుపయోగంగా ఉన్నది ,వసతులను కల్పించి బస్టాండ్ ని వినియోగంతో తీసుకురావాలి,మండల కేంద్రంలో బస్సుల రాకపోకల విషయంలో కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకొని బస్టాండ్ అభివృద్ధికి పాటుపడాలని కోరారు.




**జయభేరి, న్యూఢిల్లీ, ఏప్రిల్ 3**

మధ్య ప్రాచ్యంలో ఐదు వారాలుగా కొనసాగుతున్న యుద్ధం అత్యంత ప్రమాదకర స్థాయికి చేరుకుంది. గురువారం నాడు అమెరికా, ఇజ్రాయెల్ దళాలు సంయుక్తంగా ఇరాన్‌లోని కీలకమైన మౌలిక సదుపాయాలపై మెరుపుదాడులు చేశాయి. ఈ దాడుల్లో భాగంగా ఇరాన్ రాజధాని టెహ్రాన్ సమీపంలోని కరాజ్ నగరంలో ఉన్న అత్యంత ఎత్తైన B1 వంతెనను లక్ష్యంగా చేసుకున్నారు. ఈ దాడిలో వంతెన పాక్షికంగా ధ్వంసమవడమే కాకుండా పెద్ద ఎత్తున ప్రాణ నష్టం జరిగింది. అల్బోర్జ్ ప్రావిన్స్ డిప్యూటీ గవర్నర్ ఘోద్రతుల్లా సైఫ్ తెలిపిన వివరాల ప్రకారం, ఈ దాడిలో 8 మంది ప్రాణాలు కోల్పోగా 95 మంది తీవ్రంగా గాయపడ్డారు. సోషల్ మీడియాలో ప్రచారమవుతున్న దృశ్యాల ప్రకారం దాడి జరిగిన వెంటనే వంతెనలోని ప్రధాన భాగాలు కుప్పకూలిపోయాయి. ధ్వంసమైన బీ1 వంతెన మధ్య ప్రాచ్యంలోనే అత్యంత ఎత్తైన వంతెనగా గుర్తింపు పొందింది. 136 మీటర్ల ఎత్తులో నిర్మిస్తున్న ఈ వంతెన, టెహ్రాన్‌ను పశ్చిమ నగరమైన కరాజ్‌తో కనెక్ట్ చేసే కీలక మార్గంగా రూపొందుతోంది. ఇది ఇంకా నిర్మాణ దశలోనే ఉంది. ఈ దాడి అనంతరం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియాలో వంతెన నుంచి వస్తున్న పొగలను చూపే వీడియోను పోస్టు చేస్తూ ఇరాన్‌ను హెచ్చరించారు. ఇరాన్ తిరిగి రాతి యుగంలోకి పంపిస్తామని ఆయన గతంలోనే హెచ్చరించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇరాన్ తన దేశాన్ని గొప్పగా తీర్చిదిద్దుకోవాలని అనుకుంటే, సమయం మించిపోకముందే చర్చలకు ముందుకు రావాలి, లేకుంటే ఏమీ మిగలదు. అని ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్ లొంగిపోయే వరకు దాడులు కొనసాగుతాయని ఆయన సంకేతాలు ఇచ్చారు.
ఇరాన్ ప్రతీకార చర్యగా హిట్ లిస్ట్ విడుదల
అమెరికా ఇజ్రాయెల్ దాడులకు ప్రతి చర్యగా ఇరాన్ ఒక సంచలన నిర్ణయం తీసుకుంది. తన మౌలిక సదుపాయాలై జరిగిన దాడికి ప్రతీకారంగా మధ్య ప్రాచ్య ప్రాతంలోని నాలుగు దేశాలకు చెందిన 8 ప్రధాన వంతెనల జాబితాను విడుదల చేసింది. ఈ వంతెనలను ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉందని ఇరాన్ సెమీ అఫీషియల్ వార్తా సంస్థ ఫోర్స్ హెచ్చరించింది.
ఇరాన్ హిట్ లిస్ట్‌లో ఉన్న వంతెనలు ఇవే
కువైట్‌లోని షేక్ బజార్ అల్ అహ్మద్ అల్ సబా సీ బ్రిడ్జ్
యూఏఈలోని షేక్ జాయెద్ బ్రిడ్జ్ అల్ ముఖ్తా బ్రిడ్జ్, షేక్ ఖలీపా బ్రిడ్జ్
సౌదీ అరేబియా బహ్రెయిన్ లోని సౌదీ అరేబియాను బహ్రెయిన్‌తో కలిపే కింగ్ ఫహద్ కాజ్‌వే.
జోర్డాన్ లోని కింగ్ హుస్సేన్ బ్రిడ్జ్, దమియా బ్రిడ్జ్, అబ్దున్ బ్రిడ్జ్
ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ స్పందిస్తూ... నిర్మాణంలో ఉన్న వంతెనలు వంటి పౌర నిర్మాణాలపై దాడులు చేయడం వల్ల ఇరాన్ లొంగిపోదని స్పష్టం చేశారు. ఈ చర్యలు కేవలం శత్రువుల నైతిక పతనాన్ని , అశాంతిని మాత్రమే సూచిస్తాయని అభిప్రాయపడ్డారు. ఫిబ్రవరి 28న ప్రారంభమైన ఈ యుద్ధంలో ఇప్పటి వరకు 1340 మంది మరణించారని నివేదికలు చెబుతున్నాయి ఇందులో ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ కూడా ఉన్నారు. గల్ఫ్ ప్రాంతంలో హోర్ముజ్ జలసంధి వంటి కీలక మార్గాల్లో వాణిజ్య నౌకల రాకపోకలకు ఆటంకం కలగడంతో ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సంక్షోభం తలెత్తుతోంది.



## గ్రామాల్లో నో హెల్మెట్ నో ఎంట్రీ

- సీఐ గణేష్, ఎస్సై పిల్లల రాజు
- లక్ష్మీపురం సర్పంచ్ నల్ల ఆంజనేయులు



**జయభేరి, దంతాలపల్లి, ఏప్రిల్ 03 :**

మండలం లక్ష్మీపురం గ్రామంలో నో హెల్మెట్ నో ఎంట్రీ కార్యక్రమాన్ని దంతాలపల్లి ఎస్సై పిల్లల రాజు ఆధ్వర్యంలో నిర్వహించగా తొర్రూర్ సిఐ గణేష్ పాల్గొని మాట్లాడుతూ ప్రమాదాలు నివారించడానికి యువత తప్పనిసరిగా హెల్మెట్లను ధరించాలని అన్నారు ఈ కార్యక్రమంలో లక్ష్మీపురం సర్పంచ్ నల్ల ఆంజనేయులు యువతతో హెల్మెట్లు ధరింపజేసి గ్రామంలో అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది గ్రామ యువత పాల్గొన్నారు.

## గచ్చిబౌలి పబ్ లలో ఈగల్ టీం తనిఖీలు




**జయభేరి, హైదరాబాద్ :**

గచ్చిబౌలి పోలిస్ స్టేషన్ పరిధిలో పబ్ లలో ఈగల్ టిం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. కోండాపుర్ లోని క్వాక్ ఎరినా పబ్ లో తనిఖీలు నిర్వహించారు. గురువారం రాత్రి సౌత్ ఆఫ్రికా కు చెందిన ప్రముఖ డీజే బ్లాక్ కాఫీ పేరిట పబ్ నిర్వాహకులు భారీ ఈవెంట్ నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఈగల్ టీమ్ తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో 8 మందికి డ్రగ్స్ పాజిటివ్ గా గుర్తించారు. డ్రగ్స్ పాజిటివ్ వచ్చినవారికి గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ కి తరలించారు. గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## తెలంగాణలో 41 వేల కోట్ల ఎక్సైజ్ ఆదాయం



**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణలో గత ఏడాది భారీగా మద్యం అమ్మకాలు జరిగాయి. ఏకంగా రూ.40 వేల కోట్లకుపైగా మద్యాన్ని మందుబాబులు తాగేశారు. దీంతో తెలంగాణ ఎక్సైజ్ శాఖ ఆదాయంలో సరికొత్త రికార్డును అందుకుంది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత తొలిసారి రూ.40 వేల కోట్ల మార్కు దాటింది. ఇందులో బీర్ల అమ్మకాలు తగ్గగా.. లిక్కర్ సేల్స్ మాత్రం పెరిగినట్లు తెలుస్తోంది. గతేడాదిలో 7 శాతం లిక్కర్ సేల్స్ పెరిగినట్లు లెక్కల ద్వారా తెలుస్తోంది. ఇందులో మొత్తంగా 382.91 లక్షల కేస్ల లిక్కర్.. 387.34 లక్షల కేస్ల బీర్ల అమ్మకాలు జరిగాయి. ఇక అత్యధికంగా డిసెంబరు నెలలో రూ.5,051 కోట్ల మేర లిక్కర్ సేల్స్ జరగ్గా.. అత్యల్పంగా అక్టోబరు నెలలో రూ.2,709 కోట్ల మేర మద్యం అమ్మకాలు జరిగాయి. ఇక అంతకుముందు ఆర్థిక సంవత్సరం 202425తో పోల్చితే రాష్ట్రంలో బీర్ల అమ్మకాల్లో 9 శాతం తగ్గుదల నమోదైంది. అదే సమయంలో లిక్కర్ అమ్మకాలు మాత్రం భారీగా పెరిగాయి. 201819లో రాష్ట్రంలో మద్యం అమ్మకాల ద్వారా ప్రభుత్వ ఖజానాకు రూ.20,859 కోట్ల ఆదాయం రాగా.. అది 202526 ఆర్థిక ఏడాది నాటికి రూ.44 వేల కోట్లు దాటంది. 202425 ఏడాదిలో మొత్తంగా రూ.37,487 కోట్ల మద్యం అమ్మకాలు జరగ్గా.. అది ఈ ఏడాది మరింత పెరిగింది.



# కింగ్స్ పంజాబ్.. చెన్నైపై ఘన విజయం

- రాణించిన అయ్యర్, ప్రభ్‌సిమ్రన్
- మాత్రె మెరుపులు వృథా

జయభేరి, చెన్నై :

ఐపీఎల్‌లో నిరుటి రన్నరప్ పంజాబ్ కింగ్స్ వరుస విజయాల జోరు కొనసాగుతున్నది. శుక్రవారం చిదంబరం స్టేడియంలో జరిగిన పోరులో పంజాబ్ 5 వికెట్ల తేడాతో చెన్నై సూపర్‌కింగ్స్‌పై ఘన విజయం సాధించింది. చెన్నైని వారి సొంత ఇలాఖాలో మట్టికరిపించిన పంజాబ్ వరుసగా రెండో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. చెన్నై నిర్దేశించిన 210 పరుగుల లక్ష్యాన్ని పంజాబ్ 18.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి విజయాన్నందుకుంది. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ (29 బంతుల్లో 50, 4ఫోర్లు, 3సిక్స్‌లు) అర్ధసెంచరీకి తోడు ప్రభ్‌సిమ్రన్‌సింగ్ (43), ప్రియాంశ్ ఆర్య (39), కనోలి (36) రాణించడంతో పంజాబ్ గెలుపు సులువైంది. హెన్రీ, కంబోజ్ రెండేసి వికెట్లు తీశారు. తొలుత కింగ్స్ ఆహ్వానం మేరకు ఫస్ట్ బ్యాటింగ్ చేసిన చెన్నై.. ఆయుష్ మాత్రె (43 బంతుల్లో 73, 6 ఫోర్లు, 5 సిక్స్‌లు) వీరవిహారానికి తోడు శివమ్ దూబె (27 బంతుల్లో 45 నాటౌట్, 5 ఫోర్లు, 1 సిక్స్), సర్ఫరాజ్ ఖాన్ (12 బంతుల్లో 32, 6 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడటంతో 20 ఓవర్లకు 5 వికెట్లు కోల్పోయి 209 పరుగులు చేసింది. విజయ్‌కుమార్ (2/38) రాణించాడు.

చెన్నై ఇన్నింగ్స్‌లో ఆయుష్ ఆటే హైలైట్. సీఎస్‌కే గంపెడాశలు పెట్టుకున్న సంజూ శాంసన్ (7) చెపాక్‌లోనూ నిరాశపరిచినా కెప్టెన్ రుతురాజ్ (28) అండతో మెరీనా తీరాన మాత్రె రెచ్చిపోయాడు. క్రీజులోకి వస్తూనే బార్‌ట్‌లెట్ ఓవర్లో హ్యాట్రిక్ ఫోర్లతో తన ఉద్దేశాన్ని చెప్పకనే చెప్పిన ఈ యువ సంచలనం.. యాన్సెన్ ఓవర్లో స్కేర్ లెగ్, మిడాన్ మీదుగా రెండు భారీ సిక్స్‌లు కొట్టాడు. ఆ తర్వాత అతడి బాదుడుకు బలైంది స్టోయినిస్. అతడి బౌలింగ్‌లోనూ రెండు భారీ సిక్స్‌లతో 17 రన్స్ రాబట్టడమే గాక 29 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తిచేశాడు. ఓవర్‌కు పది పరుగులకు తగ్గకుండా సాగుతున్న చెన్నై జోరుకు చాహల్ బ్రేకులు వేశాడు. అతడి 12వ ఓవర్లో బంతిని స్వీప్ చేయబోయిన రుతురాజ్.. బౌండరీలైన్ వద్ద వధేరా చేతికి చిక్కడంతో 55 బంతుల్లో 96 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. వైశాక్ వేసిన మరుసటి ఓవర్లో థర్డ్ మ్యాన్ వద్ద చాహల్‌కు క్యాచ్ ఇవ్వడంతో మాత్రె ఇన్నింగ్స్ ముగిసింది. కార్తీక్ (1) విఫలమైనా ఆరో స్థానంలో వచ్చిన సర్ఫరాజ్.. ఉన్నది కొద్దిసేపే అయినా టెక్నిక్‌తో కూడిన ఆటతో ఆకట్టుకున్నాడు. అర్ష్‌దీప్, వైశాక్ ఓవర్లో హ్యాట్రిక్ ఫోర్లతో ఇన్నింగ్స్‌కు ఊపు తెచ్చాడు. సర్ఫరాజ్ నిష్క్రమించినా అప్పటికే క్రీజులో కుదురుకున్న దూబె.. భారీ షాట్లతో చెన్నైకి ఫినిషింగ్ టచ్ ఇచ్చాడు.

ఛేదనను పంజాబ్ దూకుడుగానే ఆరంభించింది. ఓపెనర్లు ప్రియాన్ష్, ప్రభ్‌సిమ్రన్ వేగంగా ఆడటంతో పవర్ ప్లేలో ఆ జట్టు 68/1తో పటిష్ట స్థితిలో నిలిచింది. హెన్రీ రెండో ఓవర్లో ప్రియాన్ష్ 4, 6, 4 బాదగా.. కంబోజ్ ఓవర్లో ప్రభ్‌సిమ్రన్ మూడు బౌండరీలతో అలరించాడు. ధాటిగా ఆడే క్రమంలో ఆర్యను హెన్రీ బౌల్డ్ చేసినా.. గత మ్యాచ్ హీరో కూపర్ కనోలితో కలిసి ప్రభ్‌సిమ్రన్ ఇన్నింగ్స్‌ను నడిపించాడు. ఈ జోడీ రెండో వికెట్‌కు 33 పరుగులు జోడించింది. అయితే నూర్ అహ్మద్ 9వ ఓవర్లో ప్రభ్‌సిమ్రన్ రనౌట్ అవగా 12వ ఓవర్లో కనోలిని కంబోజ్ ఔట్ చేయడంతో కింగ్స్ మూడో వికెట్ కోల్పోయింది. 6 ఓవర్లలో ఆ జట్టు విజయానికి 62 రన్స్ అవసరమవగా క్రీజులో ఉన్న కెప్టెన్ శ్రేయస్, వధేరా చెన్నై బౌలర్లను చెడుగుడు ఆడుకున్నారు. ముఖ్యంగా మంచి ఫామ్‌మీదున్న అయ్యర్.. బౌండరీలతో దుమ్మురేపాడు. తన ఇన్నింగ్స్‌లో 4ఫోర్లు, 3సిక్స్‌లతో విరుచుకుపడ్డాడు. వెంటవెంటనే అయ్యర్, నేహల్ వధేరా (10) ఔటైనా..శశాంక్‌సింగ్ (14 నాటౌట్), స్టొయినిస్ (9 నాటౌట్) పంజాబ్‌కు అలవోక విజయాన్నందించారు.

**సంక్షిప్త స్కోర్లు**

చెన్నై: 20 ఓవర్లకు 209/5 (మాత్రె 73, దూబె 45*, వైశాక్ 2/38, చాహల్ 1/21);
పంజాబ్: 18.4 ఓవర్లలో 210/5 (అయ్యర్ 50, ప్రభ్‌సిమ్రన్ 43, కంబోజ్ 2/43, హెన్రీ 2/54)



# మా బంధానికి ‘అహం’ బలం ..

## ఐశ్వర్య రాయ్ బచ్చన్‌తో రిలేషన్‌పై అభిషేక్ క్లారిటీ

బాలీవుడ్ స్టార్ జంట అభిషేక్ బచ్చన్, ఐశ్వర్య రాయ్ బచ్చన్ బంధంపై ఎప్పటినుంచో వస్తున్న ఊహాగానాల మధ్య తాజాగా అభిషేక్ చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్‌గా మారాయి. విడాకుల వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా... తన భార్యతో ఉన్న అనుబంధం, కుటుంబ జీవితం గురించి ఆయన ఓ ఇంటర్వ్యూలో మనసు విప్పి మాట్లాడారు. ప్రఖ్యాత యూట్యూబర్ లిల్లీ సింగ్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో అభిషేక్ మాట్లాడుతూ, “నా తల్లిదండ్రులు పెళ్లి చేసుకున్నప్పుడు మా అమ్మ జయా బచ్చన్ మా నాన్న అమితాబ్ బచ్చన్ కంటే పెద్ద స్టార్. అందుకే భార్య విజయవంతంగా ఉండటం నాకు కొత్త కాదు” అని అన్నారు. తన వ్యాఖ్యల్లో “అహం” అనే పదాన్ని నెగటివ్‌గా కాకుండా ఒక స్పష్టమైన ఆలోచనగా వివరించారు. నేను గెలవాలంటే నా భాగస్వామి ఓడిపోవాల్సిన అవసరం లేదు. నా భర్తతనాన్ని నిరూపించుకోవడానికి నా భార్య తన కెరీర్ ఆపాల్సిన అవసరం లేదు. అలాంటి బంధమే నాకు కావాలి. అదృష్టవశాత్తు ఐశ్వర్య కూడా ఇదే విధంగా ఆలోచిస్తుంది. అందుకే మా రిలేషన్‌షిప్‌కు నా ‘అహం’నే కారణం అన్నాను” అని చెప్పారు. అభిషేక్ వెల్లడించిన ప్రకారం, కెరీర్ ప్రారంభం నుంచే ఐశ్వర్యతో తనకు పరిచయం ఉందని, మొదట వారు మంచి స్నేహితులుగా ఉన్నారని గుర్తుచేసుకున్నారు. ఆ స్నేహమే తర్వాత ప్రేమగా మారి, 2007 ఏప్రిల్ 20న వివాహ బంధంగా మారింది. ఈ ఏడాదితో వారి వివాహానికి 19 ఏళ్లు పూర్తవుతున్నాయి. తమ కుమార్తె ఆరాధ్య బచ్చన్ పెంపకం గురించి కూడా అభిషేక్ ఓపెన్‌గా మాట్లాడారు. తండ్రులు మంచి టీచర్లు కారు. ఎందుకంటే భావోద్వేగాలు అడ్డువస్తాయి. మహిళల్లో ఉండే సున్నితత్వం మాలో ఉండదు. మగవాళ్లు ఎక్కువగా చేతల ద్వారా తమను నిరూపించుకోవాలనుకుంటారు అని చెప్పారు. పిల్లలకు ఇది సరైంది, ఇది తప్పు అని చెప్పడం కంటే, మనం ఎలా జీవిస్తున్నామన్నదే ముఖ్యమైన పాఠం. తల్లిదండ్రులు నైతిక విలువలతో జీవిస్తే పిల్లలు వాటిని చూసి నేర్చుకుంటారు. మా ఇంట్లో ఎవరు మగ, ఎవరు ఆడ అన్న పోటీ ఎప్పుడూ ఉండదు అని స్పష్టం చేశారు. కాగా, ఇటీవలి కాలంలో సోషల్ మీడియాలో ఈ జంట విడిపోతున్నారనే వార్తలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. అయితే అభిషేక్ చేసిన ఈ తాజా వ్యాఖ్యలు ఆ ఊహాగానాలకు చెక్ పెట్టినట్లుగా భావిస్తున్నారు.

# వీరభద్రుడి విశ్వరూపం



తమిళ అగ్ర హీరో సూర్య తాజా తమిళ చిత్రం ‘కరుప్పు’ తెలుగులో ‘వీరభద్రుడు’ పేరుతో విడుదల కానుంది. ఆర్జే బాలాజీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై ప్రకాష్‌బాబు, ఎస్.ఆర్.ప్రభు నిర్మిస్తున్నారు. మే 14న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది. శుక్రవారం తెలుగు టైటిల్ అనౌన్స్‌మెంట్‌తో పాటు కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో సూర్య భారీ ఖడ్గాన్ని చేతపట్టుకొని పవర్‌ఫుల్ లుక్‌లో కనిపిస్తున్నారు. పేదల పక్షాన పోరాడి వారికి అండగా నిలబడే న్యాయవాదిగా ఈ సినిమాలో సూర్య కనిపించనున్నారు. సామాజిక, ఆధ్యాత్మిక అంశాల కలబోతగా యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. వీరభద్రుడిగా సూర్య విశ్వరూపం ప్రేక్షకులకు గూజ్‌బంప్స్ తెప్పిస్తుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: సాయిఅభ్యంకర్, రచనదర్శకత్వం: ఆర్జే బాలాజీ.



# అదో గొప్ప సృజనాత్మక అనుభవం

గడిచిన నెలంతా తనకు మిశ్రమానుభూతుల్ని అందించిందంటూ సోషల్ మీడియా వేదికగా గత నెల అనుభవాలను నెమరువేసుకున్నది మలయాళ మందారం మాళవిక మోహనన్. ‘త్యాగరాజన్ కుమారరాజ దర్శకత్వంలో నేను నటిస్తున్న ‘పాకెట్ నవల్’ సినిమా షూటింగ్ గత నెలలోనే మొదలైంది. కోలీవుడ్‌లోని అత్యుత్తమ దర్శకుల్లో త్యాగరాజన్ ఒకరని నిస్సందేహంగా చెప్పగలను. ఆయన దర్శకత్వంలో వచ్చిన ‘సూపర్ డీలక్స్’ చిత్రమంటే నాకెంతో ఇష్టం. ఇప్పుడు ఆయనతోనే పనిచేస్తున్నాను. ఆయన మార్గదర్శకత్వంలో నటిగా నన్ను నేను మలచుకోవడం ఓ గొప్ప సృజనాత్మక అనుభవం. అలాగే.. షూటింగ్‌లో భాగంగా నెల రోజుల పాటు చెన్నైలోనే ఉన్నా. అంతకాలం ఇంటికి దూరంగా ఉండటం భారంగా అనిపించింది.

రోజంతా షూట్‌లో పాల్గొని, రూమ్‌కి వెళితే ఒక్కదాన్నే లోన్లీగా ఫీలయ్యేదాన్ని. అప్పడప్పుడు నాకోసం ఇంట్లోవాళ్లు వచ్చేవారు. అప్పుడు మాత్రం రిలీఫ్ అనిపించేది. షూటింగ్ పుణ్యమా అని మహాబలిపురం దేవాలయాలను సందర్శించా. తమిళనాడు ఫుడ్‌ని ఇష్టంగా ఆరగించా. కొన్ని రోజుల క్రితమే ముంబైలోని మా ఇంటికి చేరా’ అంటూ రాసుకొచ్చింది మాళవిక మోహనన్.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**